శుక్రవారం
13-10-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 113
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పలస్తీనాలో ఆహార సంక్షోభం

ఆహార సంక్షోభం దిశగా పలస్తీనా అడుగులు వేస్తోంది. ఇజ్రాయిల్ వైమానిక దాడులు తీవ్రం కావడానికి తోడు నేల మీద దాడులకు సిద్ధం కావడంతో పరిస్థితి దయనీయంగా మారింది. పలస్తీనా ప్రజలు గురువారం గాజాలోని బేకరీలు, సరుకుల దుకాణాల వద్ద క్యూకట్టారు. అందిన ఆహార పదార్థాలను కొనుగోలు చేసేందుకు తొందరపడ్డారు. దుకాణాల్లోని సరుకు ఖాళీ అయ్యే లోపు ఎంతోకొంత ఆహారాన్ని తమ వద్ద ఉంచుకునే ప్రయత్నాన్ని చేశారు.

2లో

విశాఖ సరే...

సీమ సంగతేమిటి?

- వెనుకబడిన ప్రాంతాలను పట్టించుకోరా?
- జగన్‌ను ప్రశ్నించిన రామకృష్ణ
- మోదీకి సీఎం సాగిలపడ్డారని విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా తీరుపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నిప్పులు చెరిగారు. ఏ సమస్యపైనా జగన్‌కు కనీస అవగాహన లేదని, తనకు తోచినదే పాలన అన్న విధంగా ముందుకు పోతున్నారని విమర్శించారు. జగన్‌ను అత్యంత అసమర్థ ముఖ్యమంత్రిగా అభివర్ణించారు. వెనుకబడిన ప్రాంతాలపై ఆయనకు కనీస అవగాహన లేదన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించిన రాజధాని అమరావతిని వదిలేసి...మూడు రాజధానుల పాట పాడుతున్నారని మండిపడ్డారు. మూడు రాజధానులంటే సుప్రీంకోర్టు ఉత్తర్వులను ధిక్కరించడమేనన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీశ్, జిల్లా కార్యదర్శి జాఫర్‌తో కలిసి రామకృష్ణ గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంకుశ పాలన సాగిస్తున్నాయని రామకృష్ణ అన్నారు. రాష్ట్రంలో ఏడు వెనుకబడిన జిల్లాలు ఉంటూ సీఎం జగన్ కేవలం రాజధాని పేరుతో విశాఖ పైనే దృష్టి కేంద్రీకరించారని, రాయలసీమ జిల్లాల సంగతేమిటని ప్రశ్నించారు. రాయలసీమ జిల్లాలను ముఖ్యమంత్రి గాలికి వదిలేశారని చెప్పారు. చట్టాలను, న్యాయస్థానాల తీర్పులను గౌరవించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రులు, ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. కానీ జగన్ కోర్టు ఉత్తర్వులనే ధిక్కరిస్తూ నియంతలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెనుకబడిన జిల్లాల్లో రాయలసీమ ఉన్నట్లా లేనట్లా చెప్పాలని జగన్‌ను డిమాండ్ చేశారు. వెనుకబడిన ఏడు జిల్లాలకు

- మిగతా 2 లో

రాష్ట్ర అప్పులపై శ్వేతపత్రం

వైసీపీ ప్రభుత్వానికి రామకృష్ణ డిమాండ్ 2లో

ఆకలి రాజ్యం

ప్రపంచ ఆకలి సూచీలో దిగజారిన భారత్

- 111కు పడిపోయిన ర్యాంకు
- బంగ్లాదేశ్, పాక్, శ్రీలంక కంటే అధ్వానం

న్యూదిల్లీ: భారత్‌లో ఆకలి రాజ్యమేలుతోంది. దేశం ప్రగతిపథంలో దూసుకెళుతోందని కేంద్రం చెబుతోంది. ప్రపంచంలోని టాప్-3 ఆర్థికవ్యవస్థల్లో ఒకటిగా నిలవబోతోందని ప్రధాని మోదీ గొప్పలు పోతున్నారు. అయితే ఈ మాటల్లోని డొల్లతనాన్ని బయట పెట్టే విధంగా ప్రపంచ ఆకలి సూచీ-2023లో భారత్ ర్యాంకు ఉంది. 125దేశాల్లోని పరిస్థితుల ఆధారంగా రూపొందిన ప్రపంచ ఆకలి సూచీ-2023 గురువారం విడుదలైంది. ఇందులో భారత్ 111వ ర్యాంకుకు పడిపోయింది. చైల్డ్ వేస్టింగ్ రేటు (పిల్లల్లో ఎదుగుదల లోపం) గరిష్ఠంగా 18.7 శాతంగా ఉంది. 2022లో 121 దేశాల్లో భారత్‌ది 107వ ర్యాంకు కాగా ఈ ఏడాది మరింతగా దిగజారింది. భారత్ స్కోరు 28.7 కాగా దేశంలో ఆకలి తీవ్రతకు ఇది అద్దం పట్టింది. ఇరుగు, పొరుగు దేశాలైన పాకిస్తాన్ (102వ స్థానం), బంగ్లాదేశ్ (81), నేపాల్ (69), శ్రీలంక (69) కంటే అధ్వానంగా భారత్ పరిస్థితి ఉంది. దక్షిణాసియా, దక్షిణాఫ్రికాలోని ప్రాంతాల్లో ఆకలి కేకలు ఉండగా వాటి స్కోరు 27. ఇక పిల్లల్లో ఎదుగదల లోపం ఎక్కువగా ఉన్న దేశాల్లో భారత్ మొదటి స్థానంలో ఉంది. చైల్డ్ వేస్టింగ్ రేటు 18.7శాతంగా నమోదు కాగా ఇదే అధికమని నివేదిక చెబుతోంది. భారతీయ పిల్లల్లో తీవ్రస్థాయి పౌష్టికాహార లోపాన్ని సూచిస్తోంది. పిల్లల్లో ఎత్తుకు తగ్గ బరువు ఆధారంగా ఎదుగుదలను లెక్కవేస్తారు. తాజా సూచీ ప్రకారం భారత్‌లో పౌష్టికాహార లోపం రేటు 16.6శాతం కాగా ఐదేళ్ల లోపు పిల్లల మరణాల రేటు 3.1శాతంగా ఉంది. అలాగే 15-25 ఏళ్ల యువతుల్లో రక్తహీనత 51.8శాతంగా నమోదైంది. అయితే ప్రపంచదేశాల ఆకలి సూచీలో స్కోరు 18.3గా ఉంది. 2015 నాటి స్కోరు (19.1)తో పోల్చితే ఒక పాయింట్ తగ్గింది.

దొంగ ఓట్లతో గెలవాలని వైసీపీ కుట్ర

ఎస్ఈసీకి టీడీపీ ఫిర్యాదు

ఎత్తు విషయంలో తేడాలెందుకు?

ఎస్సై నియామకాలపై హైకోర్టు తీర్పు రిజర్వ్

8లో

టెట్ తర్వాతే డీఎస్సీ

త్వరలోనే ప్రకటిస్తాం

- ట్రిపుల్ ఐటీలు, యూనివర్సిటీల్లో 3,200 పోస్టుల భర్తీకి నాలుగైదు రోజుల్లో నోటిఫికేషన్
- మంత్రి బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: త్వరలోనే డీఎస్సీని ప్రకటిస్తామని, దాని కంటే ముందు టెట్ నిర్వహిస్తామని ఆంధ్ర ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. దీనిపై ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చర్చిస్తున్నట్లు చెప్పారు. యూనివర్సిటీలు, ట్రిపుల్ ఐటీల్లో 3,200పైగా పోస్టుల భర్తీకిగాను నాలుగు లేక ఐదు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. రాజకీయ పార్టీలతో పాటు కొందరు అవగాహన రాహిత్యంతో విద్యార్థుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా అసత్యాలు మాట్లాడటం తగదని హితవు పలికారు. గురువారం వెలగపూడి సచివాలయం నాల్గోబ్లాక్ పబ్లిసిటీ సెల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బొత్స సత్యనారాయణ మాట్లాడారు. జాతీయ విద్యావిధానానికి అనువుగా రాష్ట్ర విద్యా రంగంలో అనేక సంస్కరణలతో పాటు ప్రపంచ స్థాయి పోటీ పరీక్షల్లో దీటుగా నిలిచే విధంగా విద్యార్థుల కోసం కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఉచితంగా

- మిగతా 2 లో

చంద్రబాబుకు చుక్కెదురు

- ఫైబర్‌నెట్ కేసులో 16న వ్యక్తిగత హాజరుకు ఆదేశం
- స్కిల్ కేసులో బెయిల్‌పై 17న విచారణ
- అంగళ్లు కేసులో తీర్పు రిజర్వు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబుకి గురువారం కూడా అన్ని కోర్టుల్లోనూ చుక్కెదురైంది. ఫైబర్ నెట్ కేసులో పీటీ వారెంట్‌కు అనుమతిస్తూ చంద్రబాబును వ్యక్తిగతంగా హాజరుపర్చాలని ఏసీబీ కోర్టు ఆదేశించింది. సోమవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల లోపు కోర్టు ముందు చంద్రబాబును హాజరు పర్చాలని స్పష్టంచేసింది. ఫైబర్ నెట్ కేసులో పీటీ వారెంట్లపై

- మిగతా 2 లో

స్కిల్ కేసులో లోకేశ్‌కు ఊరట

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు ఊరట లభించింది. ఈ కేసులో ప్రభుత్వం తనను ఇరికించే అవకాశం ఉందన్న అనుమానంతో పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు గురువారం డిస్పోజ్ చేసింది. ఈ కేసులో లోకేశ్‌ను నిందితుడిగా చూపలేదని, అందువల్ల ఆయనను అరెస్ట్ చేయబోమని కోర్టుకు సీఐడీ తెలిపింది.

ఒకవేళ కేసులో లోకేశ్ పేరు చేరిస్తే... అప్పుడు 41ఏ కింద నోటీసులు ఇచ్చి విచారిస్తామని చెప్పింది. అరెస్ట్ చేయబోమని సీఐడీ స్పష్టం చేయడంతో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు డిస్పోజ్ చేసింది. లోకేశ్ ముందస్తు బెయిల్ పిటిషన్ ఈ నెల 4వ తేదీన హైకోర్టులో విచారణకు రాగా 12వ తేదీ వరకూ పొడిగిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

మత్స్య సంపద

మృత్యువాత

- రొయ్యల చెరువులు, పరిశ్రమల వ్యర్థాలతో నదులు, కాలువలు కలుషితం
- ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులు
- చోద్యం చూస్తున్న అధికారులు
- నిబంధనలు ఉల్లంఘిస్తున్న అక్రమార్కులు

విశాలాంధ్ర-పాయకరావుపేట (అనకాపల్లి జిల్లా) : సహజ మత్స్య సంపద నాశనమవుతోంది. నదులు, కాలువలు, ఉప్పుటేరుల్లోని మత్స్య రాశులు మత్స్యకారుల చేతికందకుండా పోతున్నాయి. కొంతమంది స్వార్థ ప్రయోజనం మత్స్యకారుల ఉపాధికి గండికొడుతోంది. అక్రమార్కుల చర్యలు ప్రకృతి సంపదకు ముప్పు కలిగించేలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లాలో అనుమతుల్లేని రొయ్యల చెరువులు, వాటి పరిశ్రమల నుంచి విడుదలవుతున్న వ్యర్థ, కలుషిత జలాలు కాలువలు,

- మిగతా 2 లో

తిరుపతి అభివృద్ధికి

టీటీడీ నిధులు ఇవ్వాల్సిందే

బీజేపీ, వీహెచ్‌పీ ప్రకటనపై నారాయణ ఆగ్రహం

విశాలాంధ్ర- తిరుపతి: విశ్వవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన తిరుపతి తిరుమల దేవస్థానం నిధుల కేటాయింపులో బీజేపీ, విశ్వహిందూ పరిషత్ చేస్తున్న ప్రకటనలు హాస్యాస్పదంగా ఉన్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె. నారాయణ అన్నారు. నారాయణ గురువారం

- మిగతా 2 లో

పేదల కోసం ఊళ్లనే నిర్మిస్తున్నాం

- సామర్లకోట బహిరంగసభలో సీఎం వైఎస్ జగన్
- జగనన్న కాలనీలో లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ

2లో

ఇదీ లోకం!

రైల్వే భద్రతపై రాజీ వద్దు

- బక్సర్ బాధితులకు సముచిత పరిహారం ఇవ్వాలి
- బాధ్యులను కఠినంగా శిక్షించాలి
- అశ్వినీ వైష్ణవ్‌కు వినయ్ విశ్వం లేఖ

న్యూదిల్లీ: రైల్వే భద్రతపై రాజీ ప్రమాదకరమని సీపీఐ కార్యదర్శి, ఎంపీ వినయ్ విశ్వం అన్నారు. బీహార్, బక్సర్ జిల్లాలో నార్త్‌ఈస్ట్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన ఘటన క్రమంలో రైల్వే భద్రత నిధి మురిగిపోతుండటాన్ని ప్రస్తావిస్తూ కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు గురువారం లేఖ రాశారు.

'బాలాసోర్ రైలు ప్రమాదాన్ని మరువకముందే బక్సర్ జిల్లాలో ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పి ఆరుగురు చనిపోయారు. మరో 100 మందికిపైగా గాయపడ్డారు. విలాసవంతమైన రైళ్లను హడావిడిగా పట్టాలెక్కిస్తున్నారు కానీ సామాన్యుల కోసం రైళ్ల మౌలిక వసతులను విస్మరిస్తున్నారు. రైలు పట్టాలు తప్పడంతో రూ.50కోట్లకుపైగానే నష్టం జరిగింది. 2010-21లో ఏటా 23వేల మందికిపైగా రైలు ప్రమాదాల్లో చనిపోతున్నట్లు ఎన్‌సీఆర్‌బీ డేటా చెబుతోంది. ఒక్క 2021లోనే రైళ్లు ఢీకొన్న ఘటనలు 88, పట్టాలు తప్పినవి 21 ఘటనలు జరిగాయి. ఇవి ఆందోళన కలిగించే సంఖ్యలే అయినప్పటికీ సర్కార్

- మిగతా 2 లో

హమాస్‌లో అందరినీ చంపేస్తాం

- నెతన్యాహు ఘీంకారం
- గాజాపై పోరు ఉధృతం
- ఇజ్రాయిల్‌లో జాతీయ ప్రభుత్వం ఏర్పాటు
- మా వారిని విడిచిపెట్టే వరకు మానవతా సాయం అందనివ్వం
- అప్పటివరకు విద్యుత్, నీరు, నిత్యావసరాలన్నీ కట్

జెరూసలేం: ఇజ్రాయిల్-హమాస్ మధ్య పోరు గురువారానికి ఆరవ రోజుకు చేరుకుంది. ఇప్పటికే రెండు వైపుల కలిపి సుమారు 4వేల మంది మరణించారని తెలుస్తోంది. హమాస్‌పై ప్రతికారం తీర్చుకునే క్రమంలో పలస్తీనాను అన్ని వైపుల నుంచి ఇజ్రాయిల్ దిగ్బంధిస్తోంది. ఇప్పటికే నిత్యావసరాల సరఫరాను నిలిపివేసింది. బందీలుగా చేసిన తమ వారిని విడుదల చేసేంతవరకు మానవతా సాయం అందనివ్వబోమని తెగేసి చెప్పింది. హమాస్‌లోని ప్రతి ఒక్కరిని చంపేస్తామని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు సంకల్పించారు. హమాస్‌కు చెందిన ఎవరికీ ఆసుపత్రుల్లో చికిత్స అందేందుకు వీల్లేదని ఆదేశాలు జారీచేశారు. యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో దేశంలో జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నెతన్యాహు ప్రభుత్వానికి విపక్ష నేషనల్ యూనిటీ పార్టీకు చెందిన బెన్నీ గాంట్స్ మద్దతు తెలుపడంతో 'యుద్ధ కేబినెట్' ఏర్పాటైంది. మరొక ప్రతిపక్ష పార్టీ ఎయిర్ లాపిడ్ మద్దతు తెలపనప్పటికీ ఆయన కోసం యుద్ధ కేబినెట్‌లో స్థానాన్ని రిజర్వులో ఉంచారని సమాచారం. నెతన్యాహు అర్ధరాత్రి టీవీ మాధ్యమంగా సందేశమిచ్చారు. 'దేశం

- మిగతా 2 లో

రాష్ట్ర అప్పులపై శ్వేతపత్రం

వైసీపీ ప్రభుత్వానికి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అందినకాడికి అప్పులు చేయడంలో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం, ఇక్కడ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏమాత్రం తీసిపోలేదని విమర్శించారు. తొమ్మిదేళ్లలో మోదీ ప్రభుత్వం రూ.115 లక్షల కోట్లు అప్పు చేసిందని, బడా కార్పొరేట్లకు వేలకోట్ల రూపాయల బ్యాంకు రుణాలు రద్దు చేసిందన్నారు. పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని రామకృష్ణ దుయ్యబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అప్పులు ప్రజలకు గుదిబండగా మారుతున్నాయని, మోదీ, జగన్‌లది అప్పుల పాలన అని ఆయన విమర్శించారు. జగన్ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో చేసిన అప్పు దాదాపు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలకోట్లకు చేరిందని అఖిలపక్షాలు, ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులు, వివిధ కార్పొరేషన్లు, వివిధ ప్రభుత్వ సంస్థలు, ఫైనాన్సియల్ సర్వీసులు, సివిల్ సప్లయిస్, లిక్కర్ తదితర బాండ్ల ద్వారా రుణాలు, కార్మిక సంక్షేమ బోర్డు నిధులు, గ్రామ పంచాయితీల నిధులు మళ్లింపు, పబ్లిక్ ఖాతా నిధి, ట్రాన్స్‌కో, జెన్‌కోల ద్వారా తీసుకున్న మొత్తాలు తదితరాలన్నీ కలిపి అప్పు రూ.10 లక్షల కోట్లకు పైగా చేరింది. జగన్ సర్కార్ ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి దాటి ఆరుసార్లు రూ.67వేల కోట్లు అప్పు చేసింది. ఎఫ్‌ఆర్‌బీఎం రుణపరిమితికి మించి ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేయడం రాష్ట్ర ప్రభుత్వ తిరోగమన విధానాలకు తార్కాణం. ఉద్యోగులకు ప్రతినెలా 1వ తేదీన జీతాలు చెల్లించేందుకు కూడా అప్పులు వెదకుతున్న దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. రాష్ట్ర బడ్జెట్ పెరుగుతున్నప్పటికీ మూలధన వ్యయం ఎన్నడూ లేనంతగా అతి తక్కువగా ఉండటం ఆందోళనకరం. ఇదే పరిస్థితి కొనసాగితే ఏపీ దివాళా దిశగా పయనించడం ఖాయం. నాలుగున్నర ఏళ్లలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేసిన అప్పులపై శ్వేతపత్రం ప్రకటించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

విశాఖ సరే...సీమ సంగతేమిటి?

(మొదటిపేజీ తరువాయి)

బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని విభజన చట్టంలో పొందుపరిచినా కేంద్రం అమలు చేయడం లేదని, దీనిని జగన్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎన్నికల్లో గెలుపు కోసం ఇటీవల కర్నాటకకు సంబంధించి ఎగువభద్ర ప్రాజెక్టుకు మోదీ సర్కారు రూ.5,600 కోట్లు మంజూరు చేసిందని, ఇది నిర్మాణమైతే రాయలసీమ ఎడారిగా మారడం ఖాయమని రామకృష్ణ చెప్పారు. దీనిపై కేంద్రాన్ని జగన్ ప్రభుత్వం ప్రశ్నించిన దాఖలాలే లేవన్నారు. ఇప్పుడుతెలంగాణ ఎన్నికల్లో లబ్ధి కోసం కృష్ణా జలాల వివాదాన్ని తెరపైకి తీసుకొచ్చిందని ఆరోపించారు. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం మొత్తం 811 టీఎంసీల నీటిలో తెలంగాణకు 299, ఆంధ్రాకు 512 టీఎంసీలు కేటాయించారని, దీనికి మోదీ సర్కారు తూట్లు పొడుస్తోందని రామకృష్ణ వివరించారు. అటు ఎగువ భద్ర ప్రాజెక్టు, ఇటు కృష్ణా జలాల పున:పంపిణీ వల్ల ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరుగుతుందని చెప్పారు. అయినా జగన్ సర్కారు నోరు మెదపడం లేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్వార్థ ప్రయోజనాలకు రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం, సాగర్ ఆయకట్టు ప్రాంతాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈనెల 18న కడప జిల్లా కేంద్రంలో 12 జిల్లాల నాయకులతో భారీ సదస్సు ఏర్పాటు చేశామని, 14న తెలుగుదేశం పార్టీ విజయవాడలో ఏర్పాటు చేసిన సమావేశానికి తాము హాజరవుతున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం తీవ్ర అన్యాయం చేస్తున్నా... సీఎం జగన్ మాత్రం మోదీకి జీహుజూర్ అంటున్నారని విమర్శించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, నగర కార్యదర్శి శ్రీరాములు పాల్గొన్నారు.

రైల్వే భద్రతపై రాజీ వద్దు

(మొదటిపేజీ తరువాయి)

పటిష్ఠ చర్యలు తీసుకోకుండా ప్రచార్భాటాలకే పరిమితమవుతోంది. రైల్వే ట్రాక్‌ల పునరుద్ధరణ, వంతెనలు పటిష్ఠపర్చడం, సిగ్నలింగ్ వ్యవస్థలను మెరుగుపర్చడం తదితరాల కోసం ఏర్పాటు చేసిన నిధి 'రాష్ట్రీయ రైల్వే సంరక్ష కోశ్' (ఆర్‌ఆర్‌ఎస్‌కే) నిరుపయోగంగా ఉంటోంది. రైల్వే భద్రత మెరుగుదల ఉద్దేశాలను నీరుగారుస్తూ నిధులను మురగబెడుతున్నట్లు కాగ్ సహా అనేక నివేదికలు వెల్లడించాయి. రైల్వే భద్రతకు సంబంధించి క్లిష్ట ఉద్యోగాల నిర్వహణ ఔట్‌సోర్సింగ్ లేద ఒప్పంద వర్కర్లకు అప్పగిస్తుండటం అందరికీ తెలుసు. పౌరుల భద్రత విషయంలో ప్రభుత్వం కచ్చితత్వంతో లేకపోవడానికి ఇది అద్దం పడుతోంది' అని వినయ్ విశ్వం పేర్కొన్నారు. సామాన్య ప్రజల కోసం రైల్వే ప్రాధాన్యతలను మళ్లీ నిర్దేశించడం అవసరమని సూచించారు. బక్సర్ ప్రమాద బాధితులకు సముచిత పరిహారాన్ని ప్రకటించాలని కోరారు. కారకులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని అశ్వినీ వైష్ణవ్‌కు రాసిన లేఖలో వినయ్ విశ్వం పేర్కొన్నారు.

టెట్ తర్వాతే డీఎస్సీ

(మొదటిపేజీ తరువాయి)

ట్యాబ్‌ల పంపిణీ, బైజూస్ విద్యాకంటెంట్, టోఫెల్ శిక్షణ తదితరాలు అమలవుతున్నట్లు తెలిపారు. బైజూస్‌తో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందాల నేపథ్యంలో వేల కోట్ల అక్రమాలు జరిగాయనే దుష్ప్రచారాన్ని ఖండించారు. బైజూస్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క పైసా కూడా చెల్లించలేదని స్పష్టం చేశారు. ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ పారిశ్రామిక సదస్సు సందర్భంగా బైజూస్ వారే సీఎంను నేరుగా కలసి విద్యార్థులకు బైజూస్ విద్యా కంటెంట్‌ను ఉచితంగా ఇస్తామన్నారని మంత్రి గుర్తుచేశారు. పేద విద్యార్థులకు ఆన్‌లైన్ విద్యను అందుబాటులోకి తెస్తే వారి విద్యా ప్రమాణాలు పెరుగుతాయనే ఉద్దేశంతో బైజూస్ కంటెంట్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. దాదాపు 35లక్షల మంది విద్యార్థులకు మేలు జరుగుతోందని తెలిపారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు 5.18 లక్షల ట్యాబ్‌లను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ఆంగ్ల మాధ్యమంలో బోధనతో పాటు ప్రపంచ స్థాయి టోఫెల్ పరీక్షల కోసం రాష్ట్ర విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రాథమిక స్థాయి నుంచే శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. స్పోకెన్ ఇంగ్లీషు నైపుణ్యాన్ని పెంచేందుకు అమెరికన్ సంస్థ 'ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీసెస్' (ఈటీఎస్)తో ఒప్పందం కుదుర్చుకున్నామని మంత్రి చెప్పారు. ఐదో తరగతి విద్యార్థులకు టోఫెల్ ప్రైమరీ, తొమ్మిదో తరగతి స్థాయి వారికి టోఫెల్ జూనియర్ పేరుతో పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తామని అన్నారు. ప్రాథమిక స్థాయిలో 6.31లక్షల మందికి, జూనియర్ స్థాయిలో 14.39 లక్షల మందికి వెరసి మొత్తం 20.70 లక్షల మంది విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఇందు కోసం పరీక్ష ఫీజులకు రూ.1.55 కోట్లు, సర్టిఫికేషన్ టెస్టు ఫీజులు మొత్తంగా రూ.4.80 కోట్లు వెచ్చించినట్లు బొత్స సత్యనారాయణ వెల్లడించారు.

అమిత్ షాతో లోకేశ్ భేటీపై టీడీపీ సమాధానమేమిటి?

చంద్రబాబు అరెస్టు బీజేపీ వారికి తెలిసే జరిగిందని ఆరోపించిన టీడీపీ నేతలు, ఢిల్లీ కేంద్రంగా హోంమంత్రి అమిత్ షాతో నారా లోకేశ్ భేటీని ఎలా చూస్తారని బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. బీజేపీలో బీ టీమ్‌గా ఉన్న సుజనా చౌదరి తదితరులు సైతం నిన్నటి వరకు చంద్రబాబు అరెస్టును కేంద్రంలోని బీజేపీ వారికి తెలిసే జరిగిందని వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. ఢిల్లీ తాజా పరిణామాలపై విలేకరుల ప్రశ్నకు బొత్స బదులిస్తూ, చంద్రబాబు ఎప్పుడు బయటకు వస్తారనేదీ తనకు ఎలా తెలుస్తుందని ఎదురు ప్రశ్నించారు. పురంధీశ్వరి, లోకేశ్ ఢిల్లీకి వెళ్లి తమపై చాడీలు చెప్పివుంటారన్నారు. పురంధీశ్వరి సమక్షాన లోకేశ్, అమిత్ షా భేటీ వివరాలను వెల్లడించాలన్నారు.

పలస్తీనాలో ఆహార సంక్షోభం

- బేకరీలు, దుకాణాల వద్ద జనం బారులు
- నిలిచిపోయిన నిత్యావసరాలు, తాగునీరు, ఇంధనం, విద్యుత్
- అత్యవసర సేవల్లేక శవగారాలవుతున్న ఆసుపత్రులు
- ఇజ్రాయిల్ దాడులతో గాజాలో దయనీయ స్థితి

జెరూసలేం: ఆహార సంక్షోభం దిశగా పలస్తీనా అడుగులు వేస్తోంది. ఇజ్రాయిల్ వైమానిక దాడులు తీవ్రం కావడానికి తోడు నేల మీద దాడులకు సిద్ధం కావడంతో పరిస్థితి దయనీకంగా మారింది. పలస్తీనా ప్రజలు గురువారం గాజాలోని బేకరీలు, సరుకుల దుకాణాల వద్ద క్యూకట్టారు. అందిన ఆహార పదార్థాలను కొనుగోలు చేసేందుకు తొందరపడ్డారు. దుకాణాల్లోని సురుకు ఖాళీ అయ్యే లోపు ఎంతోకొంత ఆహారాన్ని తమ వద్ద ఉంచుకునే ప్రయత్నాన్ని చేశారు. చుట్టుపక్క ప్రాంతాలన్నీ ధ్వంసమవుతుండటం, పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇజ్రాయిల్ ఇప్పటికే ఆహారం, తాగునీరు, ఇంధనం, విద్యుత్ సరఫరాను నిలిపివేసింది. ఇదే కొనసాగితే పరిస్థితి మరింత జటిలమవుతుందని, మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని అంతర్జాతీయ సహాయ సంఘాలు హెచ్చరిం చాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆసుపత్రుల్లో విద్యుత్ లేక ఇన్‌క్యూబేటర్లలో ఉన్న పసిపిల్లలు, ఆక్సిజన్ అవసరమైన వృద్ధుల ఆయువు తరగిపోతోంది. ఎక్స్‌రే, కిడ్నీ డయాలసిస్ వంటివి ఆగిపోయాయి. విద్యుత్ లేకుండా ఆసుపత్రులన్నీ శవగారాలుగా మారిపోతున్నాయి.

హమాస్ బందీలుగా ఉన్న ఇజ్రాయిలీలను క్షేమంగా ఇంటికి పంపితే తప్ప గాజాకు ఎలాంటి సౌకర్యాలు, సాయం అందబోవని ఇజ్రాయిల్ ఇంధన శాఖ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ తేల్చిచెప్పారు. 'ఒక్క స్విచ్ ఆన్ చేయనివ్వం. ఒక్క పంపు తిప్పనివ్వం. ఒక్క ఇంధన ట్రక్కును కదలనివ్వం' అని ఆయన ట్వీట్ చేశారు. ఇజ్రాయిలీ సైనిక అధికారి లెఫ్టినెంట్ కల్నల్ రిచర్డ్ హెట్జ్ మాట్లాడుతూ 'గగనతలం నుంచే కాదు నేల మీద నుంచి దాడులకు సన్నద్ధమయ్యాం. రాజకీయ నేతల ఆదేశాలు ఇంకా అందలేదు' అని చెప్పారు. ఒకసారి 'ఇంటింటి' పోరు మొదలైతే ప్రాణ నష్టం భారీగా ఉంటుందని మానవతా సంఘాలు పేర్కొన్నాయి. హమాస్ 150 మంది ఇజ్రాయిలీలను బంధించిందని ఇజ్రాయిల్ తెలిపింది. వైమానిక దాడుల నుంచి తప్పించు కునేందుకు సురక్షిత ప్రాంతాల కోసం వెతుకులాటలో పలస్తీనా ప్రజలు వీధుల్లో అదరా బాదరాగా పరుగులు తీసే వీడియోలు వైరలయ్యాయి. ఐరాస నడిపే పాఠశాలల్లో వేలాది మంది శరణ కోరగా అనేకమంది బంధుమిత్రుల వద్ద ఆశ్రయం పొందుతున్నారు. హమాస్‌ను తుడిచిపెట్టేంత వరకు విశ్రమించబోమని ఇజ్రాయిల్ సంకల్పించింది. 3,60,000 మంది రిజర్విస్టులు, అదనపు దళాలను గాజా చుట్టూ మోహరించింది. లక్షల మందిని ఖాళీ చేయించింది. ఇజ్రాయిల్‌లో జాతీయ ప్రభుత్వం ఏర్పాటుతో నెతన్యాహుకు కొత్త యుద్ధ కేబినెట్ మద్దతు లభించింది. అమెరికా మద్దతు తోడు కావడం ఆయనకు శక్తిని పెంచింది. ఇజ్రాయిల్ పర్యటనలో ఉన్న అమెరికా కార్యదర్శి ఆంటోనీ బ్లింకెన్ శుక్రవారం పలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్, జార్డన్ రాజు అబ్దుల్లా-2తో భేటీ కానున్నట్లు సమాచారం. ఇజ్రాయిల్ సైన్యం హమాస్‌కు నుఖ్‌బా దళాలపై దాడులు చేసింది. సీనియర్ కమాండర్‌ను హతమార్చింది. అగ్రనాయకత్వాన్ని అంతం చేయడమే లక్ష్యమని హెట్జ్ వెల్లడించారు. సైనిక నాయకత్వాన్నే కాదు ప్రభుత్వ నాయకత్వాన్నీ, హమాస్ అగ్రనేత యహియా సిన్వర్‌ను ఉపేక్షించబోం... వీరంతా కలిసే ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

పౌరులపై ఆకస్మిక దాడులు వద్దు: ఇజ్రాయిల్‌కు హమాస్ హెచ్చరిక

పలస్తీనా పౌరులపై ఆకస్మిక దాడులు చేయడం ద్వారా అమాయకుల ప్రాణాలు హరిస్తే ఊరుకునేది లేదని ఇజ్రాయిల్‌కు హమాస్ స్పష్టంచేసింది. ఎటువంటి హెచ్చరిక లేకుండా రెండు బహుళ అంతస్తుల నివాస భవనాలపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు జరుగగా భారీగా మరణాలు సంభవించాయని, అనేకమందికి గాయాలైనట్లు హమాస్ నేతృత్వ అంతర్గత శాఖ తెలిపింది. హెచ్చరికలు చేయకుండా పలస్తీనా పౌరులపై దాడులు చేస్తే తమ వద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయిల్ పౌరులను చంపేస్తామని హమాస్ హెచ్చ రించింది. అయితే దాడుల గురించి ముందే హెచ్చరిస్తు న్నట్లు ఇజ్రాయిల్ సమర్థించుకుంది. గతంలో పౌరుల మరణాల విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండే ఇజ్రాయిల్ సైన్యం తీరు ప్రస్తుతం మారింది. విధ్వంసకర యంత్రంగా వ్యవహరి స్తోంది.లక్షిత ప్రాంతంపై ఒక్కసారిగా బాంబుల వర్షం కురిపించడం లేదని, ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగానే లక్ష్యాలు నిర్ణయిస్తున్నామని, పౌరులకు హెచ్చరికలు చేస్తున్నామని హెట్జ్ చెప్పారు. దాడుల సమాచారం ఉన్నా కొన్ని కుటుంబాలు తప్పించుకోలేక సజీవసమాధి అవుతున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సమాచారం ఇవ్వకుండానే దాడులు జరుగుతున్నట్లు తెలిపారు.కాగా వైమానిక దాడుల వల్ల 3,39,000 మంది నిరాశ్రయులైనట్లు ఐరాస వెల్లడించింది.

పేదల కోసం ఊళ్లనే నిర్మిస్తున్నాం

విశాలాంధ్రబ్యూరో-కాకినాడ: రాష్ట్రంలో పేదలకోసం వైసీపీ ప్రభుత్వం నిర్మిస్తున్నది ఇళ్లు కాదు... ఊళ్లని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పేదలందరికీ ఇళ్ల నిర్మాణం కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లా సామర్లకోటలో వైఎస్ఆర్ జగనన్న కాలనీల్లో నిర్మించిన ఇళ్లను సీఎం జగన్ గురువారం ప్రారంభించారు. ఉదయం తాడేపల్లి నుండి హెలీకాప్టర్‌లో సామర్లకోటకు చేరుకున్న జీఎం జగన్... అక్కడి నుంచి బస్సులో గృహసముదాయాల ప్రాంతానికి చేరుకున్నారు. లబ్ధిదారులతో కలిసి నూతన గృహాలను ప్రారంభించి వారికి నూతన వస్త్రాలను అందజేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించి, అక్కడి నుంచి సభా స్థలికి చేరుకుని బహిరంగ సభలో మాట్లాడారు. రెండేళ్లలోనే పేదల సొంతింటి కలను నెరవేర్చామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 17వేల జగనన్న కాలనీలు ఏర్పాటవుతున్నాయని... రాష్ట్రంలో 7.43 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని వెల్లడించారు. మరో 14.33లక్షల ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని తెలిపారు. ప్రతీ పేదవాడి ముఖంలో చిరునవ్వు కనిపిస్తోందని సగర్వంగా చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై విమర్శలతో విరుచుకుపడ్డారు. ఏపీకి చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణ, పవన్ కళ్యాణ్ నాన్-లోకలేనని.. సొంత పార్టీని, సొంత వర్గాన్ని, అభిమానుల ఓట్లను హోల్‌సేల్‌గా అమ్ముకునే వ్యాపారి ఈ పవన్ కళ్యాణ్ అన్నారు. 'చంద్రబాబు కంటిన్యూగా నెలరోజులపాటు మన రాష్ట్రంలో ఉన్నారా? చంద్రబాబు ఇప్పుడు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నారు. చంద్రబాబు, లోకేశ్, దత్తపుత్రుడు, బాలకృష్ణ ఎవరూ మన రాష్ట్రంలో ఉండరు. చంద్రబాబు సొంతిల్లు పక్క రాష్ట్రంలో ఉంది. దత్తపుత్రుడి శాశ్వత చిరునామా హైదరాబాద్. ప్రజలు తేడాను గమనించాలన్నారు. ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇస్తున్నామని, మరో రూ.30 వేలు పావలా వడ్డీకే రుణాలుగా ఇచ్చామన్నారు. ప్రతి ఒక్కరికి మంచి చేస్తూ ఉచితంగా ఇసుకను ఇస్తున్నామని దీని విలువ రూ.15 వేలు, సిమెంట్, స్టీల్, మెటల్, తదితర నిర్మాణ సామాగ్రి ధర తగ్గించి ఇస్తున్నామని... వీటి విలువ మరో రూ.40 వేలు ఉంటుందని, ఒక్కో ఇంటికి రూ.2.70 లక్షలు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఆనాటి ముఖ్యమంత్రికి, ఈ ముఖ్యమంత్రికి తేడా గమనించాలని కోరారు. దత్తపుత్రుడి ఇళ్లు హైదరాబాద్‌లోనే శాశ్వతంగా ఉన్నాయి కానీ ఆయన ఇంట్లో ఇల్లాలు మాత్రం ప్రతి మూడేళ్లకు ఒకసారి మారిపోతుంటారని సీఎం జగన్ వ్యక్తిగత విమర్శలు చేశారు. మహిళలపై కాని, పెళ్లిళ్ల వ్యవస్థ పై కానీ పవన్‌కు గౌరవం లేదని ఇలాంటి వ్యక్తిని నాయకుడిగా ఎలా నమ్ముతారని సీఎం ప్రశ్నించారు. ఈ ప్యాకేజీ స్టార్ పోటీ చేసి ఓడిపోయిన భీమవరం, గాజువాకతో కూడా సంబంధం లేదని, కేవలం ఈ నియోజక వర్గాలను పనిముట్లుగా చూసి యూజ్ అండ్‌త్రోగానే భావిస్తారని ఆరోపించారు. మన రాష్ట్రమైనా, మన ప్రజలైనా, మన కాపులైనా ఇలాంటి వ్యక్తికి ఎలాంటి ప్రేమ ఉంటుందో ఒక్కసారి ప్రజలు ఆలోచన చేయాలని సీఎం జగన్ కోరారు. కష్టం వచ్చినా, నష్టం వచ్చినా నిలబడే వాడే రాజకీయ నాయకుడని... అలాంటి విలువలు, విశ్వసనీయత వీరికి ఉందా? అని సీఎం ప్రశ్నించారు. జగన్ పేరు చెబితే లంచాలు లేని డీబీటీ పాలన గుర్తుకు వస్తుందని... బాబు పేరు చెబితే గజదొంగల ముఠా, పెత్తందారి అహంకారం గుర్తొస్తుందని ఆరోపించారు. స్థానిక వైసీపీ ఇన్‌చార్జి దొరబాబును రానున్న ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిస్తూ పెద్దాపురం నుంచి దొరబాబు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు.

హమాస్‌లో అందరినీ చంపేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

పణంగా ఉన్నందున మిగతా అన్ని అంశాలను పక్కకు పెట్టేశాం. మేమంతా కలిసి పనిచేస్తాం. ఇజ్రాయిల్ కోసం పౌరుల కోసం చేయి చేయి కలుపుతున్నాం. రాక్షసులను, ఐసిస్ కంటే క్రూరులను చూశాం. ఈ భూమి మీద హమాస్ నామ రూపాలు లేకుండా చేస్తాం. ఆ సంస్థకు చెందిన వారిని వేరిపారేస్తాం. ప్రతి ఒక్కరిని అంతం చేసేంత వరకు విశ్రమించబోం. చిన్న పిల్లలపై కాల్పులు, వారి తలలు నరికేయడం, పురుషులు, మహిళలను సజీవంగా దహనం చేయడం, యువతులపై అఘాయిత్యాలు వంటివి కలచివేస్తున్నాయి. ఇజ్రాయిల్‌లో ప్రతి కుటుంబానికి ఈ దాడుల్లో హత్యకు గురైన ఎవరో ఒకరితో పరిచయం ఉంది. కుటుంబ సభ్యులను కోల్పోయిన వారు అనేకమంది ఉన్నారు. హమాస్ దాడులను దీటుగా ఎదుర్కొన్న యుద్ధవీరులను కొనియాడారు. మన గడ్డ కోసం మనమంతా పోరాడుతున్నాం' అని అన్నారు. అత్యవసరంగా జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు ప్రకటించారు. కాగా, 1,300 మంది ఇజ్రాయిలీలు మృత్యువాత పడినట్లు స్థానిక మీడియా తెలిపింది. 3,300 మందికి గాయాలయ్యాయని, వీరిలో 350 తీవ్రంగా గాయపడగా 28 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొంది.

పలస్తీనా బిక్కుబిక్కు

ఇజ్రాయిల్ సైనిక-వైమానిక భీకర దాడులలో గాజావ్యాప్తంగా విధ్వంసం జరుగుతోంది. మృత్యుఘోష వినిపిస్తోంది. సంచార జీవుల్లా పలస్తీనా ప్రజల పరిస్థితి ఉంది. తినడానికి ఆహారంగానీ తాగేందుకు నీరుగానీ లేదు. ఇంధనం లేక విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎటు వెళ్లాలో తెలియదు. ఇల్లు కూడా లేదు. ఏకైక సౌరవిద్యుత్ కేంద్రం ఆగిపోయింది. చిమ్మచీకటిలో శిథిలాల కింద బాంబు మోత నడమ గడపాల్సిన దుస్థితి నెలకొంది. ఐదు రోజులుగా గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయిల్ యుద్ధవిమానాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వైమానిక దాడుల్లో ఇప్పటికే 1,354 మంది పలస్తీనా ప్రజలు చనిపోగా 5,600 మంది గాయపడినట్లు గాజా ఆరోగ్యశాఖ ప్రకటించింది. హమాస్ బందీ చేసిన వారిని సురక్షితంగా విడిచి పెడితే తప్ప మానవతా సాయం గాజాకు అందనిచ్చేది లేదని ఇజ్రాయిల్ ఇంధన మంత్రి ఇజ్రాయిల్ కట్స్ తేల్చిచెప్పారు.

ఇరాన్-సౌదీ చర్చ

పలస్తీనాపై దాడులను నిలిపివేయాలని ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ, సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ పిలుపునిచ్చారు. ఈ ఇద్దరు నాయకులు ఇజ్రాయిల్-పలస్తీనా తాజా పరిస్థితిపై ఫోన్ సంభాషణ జరిపారు. పలస్తీనాపై యుద్ధ నేరాలకు అంతం పలకాల్సిన ఆవశ్యకతపై రైసీ, యువరాజు సల్మాన్ చర్చించినట్లు ఇరాన్ మీడియా పేర్కొంది. చైనా మధ్యవర్తిత్వం ఫలించడంతో టెహ్రాన్‌కు, రియాద్‌కు మధ్య సంబంధాలు మెరుగైన విషయం విదితమే.

అమెరికా సంఘీభావం- ఇజ్రాయిల్‌లో బ్లింకెన్ పర్యటన

అమెరికా కార్యదర్శి ఆంటోని బ్లింకెన్ ఇజ్రాయిల్ చేరుకున్నారు. హమాస్ దాడుల క్రమంలో సంఘీభావం తెలిపేందుకు ఆయన ఆ దేశంలో పర్యటించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ యుద్ధంలో ఇజ్రాయిల్‌కు అమెరికా వెన్నుదన్నుగా ఉంది. అవసరమైన సాయాన్ని అందిస్తోంది. సైనిక సహకారాన్ని మరింత పెంపొందిచేందుకూ సానుకూలంగా ఉంది. ఈ యుద్ధ పరిస్థితిని ఆసరాగా చేసుకుని లబ్ధి పొందే ప్రయత్నాలను ఏ దేశం కూడా చేయకూడదని అధ్యక్షుడు బైడెన్ స్పష్టమైన సందేశమిచ్చారు. దీనిని మరింత బలంగా వినిపిస్తున్నట్లు బ్లింకెన్ వెల్లడించారు. యుద్ధం క్రమంలో ఆచూకీలేని అమెరికా పౌరుల గురించి ఆరా తీయడంతో పాటు ఇజ్రాయిల్‌కు సంఘీభావం తెలుపడమే తన ఈ పర్యటన ఉద్దేశంగా తెలిపారు.

భారతీయుల తరలింపు-బయల్దేరిన తొలి విమానం

ఇజ్రాయిల్‌లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తరలించేందుకు రెండు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. ఇజ్రాయిల్‌లోని బెన్ గురియన్ విమానాశ్రయం నుంచి తొలి చార్టర్ విమానం గురువారం సాయంత్రం భారత్‌కు బయలుదేరింది.

చంద్రబాబుకు చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

గురువారం ఉదయం నుంచి వాదనలు జరిగాయి. చంద్రబాబు తరపున పోసాని వెంకటేశ్వర్లు, సీఐడీ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వివేకానంద వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టులో శుక్రవారం క్వాష్ పిటిషన్‌పై విచారణ ఉన్న నేపథ్యంలో తీర్పు రేపటికి వాయిదా వేయమని చంద్రబాబు తరపు న్యాయవాదులు కోరారు. సీఐడీ న్యాయవాదులు వచ్చిన తర్వాత వాళ్ల అభిప్రాయం కూడా తీసుకొని నిర్ణయం చెబుతానని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. చంద్రబాబును కోర్టుకు తీసుకురావాలని సీఐడీ న్యాయవాది సుదీర్ఘ వాదనలు వినిపించారు. వాదనల అనంతరం చంద్రబాబును కోర్టుకి వ్యక్తిగతంగా హాజరుపర్చవల్సిందిగా న్యాయమూర్తి ఆదేశించారు. ఇక అంగళ్ల కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ పూర్తయినప్పటికీ న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. శుక్రవారం తీర్పు వెల్లడిస్తామని తెలిపింది. 'సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి' పేరిట ఆగస్టు 4న అన్నమయ్య జిల్లాలో చంద్రబాబు పర్యటించారు. అంగళ్లు మీదుగా ఆయన వెళుతున్నప్పుడు వైసీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడటం, టీడీపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొన్నది. ఈ ఘటనలో చంద్రబాబు సహా ఆ పార్టీకి చెందిన మొత్తం 179 మంది నేతలపై కురబలకోట మండలం ముదివేడు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అందులో చంద్రబాబును ఏ-1గా చేరుస్తూ... హత్యాయత్నంతో పాటు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. దీనిపై టీడీపీ నేతలు హైకోర్టును ఆశ్రయించగా విచారణ అనంతరం కొందరికి బెయిల్ లభించింది. ఆ తర్వాత మరికొంతమందికి బెయిల్ మంజూరైంది. చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై సెప్టెంబరు 26న ఆయన తరపు న్యాయవాది హైకోర్టులో వాదనలు వినిపించారు. చంద్రబాబుపై అధికార పార్టీ నేతలే దాడి చేసి వాళ్లే కేసు పెట్టారని విన్నవించారు. రాళ్లు రువ్విన ఘటనలో చంద్రబాబును ఎన్ఎస్‌జీ కమాండర్లు కాపాడారని కోర్టుకు తెలిపారు. బాధితుల మీదే పోలీసులు కేసు నమోదు చేయడం సరికాదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులో ఇప్పటికే చాలామందికి ముందస్తు బెయిల్ మంజూరు చేశారని, అందువల్ల చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరారు. రెండువైపుల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది.

స్కిల్ కేసులో విచారణ 17కి వాయిదా

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తదుపరి విచారణను 17వ తేదీకి వాయిదా వేసింది. ఈలోగా కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఆదేశించింది. ఈ కేసులో తమ వాదనను పరిగణనలోకి తీసుకోకుండా ఏసీబీ కోర్టు బెయిల్ పిటిషన్ కొట్టేసిందని తెలిపారు. ప్రజాజీవితంలో ఉన్నానని, చట్టాన్ని గౌరవించే వ్యక్తినని, దర్యాప్తునకు పూర్తి సహకారం అందిస్తానని చంద్రబాబు తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేయాలని కోరారు. దీనిపై విచారణను హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది.

మత్స్య సంపద మృత్యువాత

(మొదటిపేజీ తరువాయి)

ఉప్పుటేరు, నదుల్లో కలిసిపోతుండటంతో వాటిల్లో ఉండే మత్స్య సంపద మృత్యువాత పడుతోంది. ఇప్పటికే సముద్ర తీరం వెంట ఏర్పాటు చేసిన రసాయన పరిశ్రమలతో సముద్రంలో మత్స్యసంపద నాశనమవుతుండగా, ఇది చాలదన్నట్లు మత్స్యకార గ్రామాల సమీపంలో ఏర్పాటు చేసిన రొయ్యల చెరువులు, పరిశ్రమలు విడుదల చేసే వ్యర్థ, కలుషిత జలాలు మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీస్తున్నాయి. ఏళ్ల తరబడి ఇదే విధంగా కొనసాగుతున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలంలో సుమారు 400 ఎకరాల్లో రొయ్యల చెరువులు ఉన్నాయి. వీటిల్లో కొన్నింటికి అనుమతులు ఉండగా, చాలా చెరువులు అక్రమంగా తవ్వినవే. రొయ్యల చెరువులు ఏర్పాటు చేసే సమయంలోనే గ్రామంలో రొయ్యల చెరువుల యజమానులు గ్రామాభివృద్ధికి సహాయం చేస్తామని చెప్పి, ఎంతో కొంత ముట్టచెప్పి రొయ్యల చెరువులు ఏర్పాటు చేసుకొని లక్షలు సంపాదిస్తున్నారు. సమీపంలోని నదులు, చెరువులు, కాలువలు, ఉప్పుటేరుల్లోకి వ్యర్థ, కలుషిత జలాలను విడుదల చేస్తున్నారు. దీంతో వాతావరణ కాలుష్యంతో పాటు సహజ జలాల్లోని మత్స్య సంపద కూడా నాశనమవుతోంది. తూర్పు గోదావరి జిల్లా అన్నవరం నుంచి పంపానది ప్రవహిస్తూ మండలంలోని వెంకటనగరం గ్రామం వద్ద సముద్రంలో కలుస్తుంది. ఈ ప్రాంతంలో ఉప్పుటేరులో, పంపా నదిలో మత్స్యకారులు చేపల వేట కొనసాగిస్తారు. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్నవారు, వికలాంగులు, సముద్రంలో వేట చేయలేనివారు ఏడాది కాలం చేపల వేట సాగిస్తూ జీవనం గడుపుతుంటారు. ఉప్పుటేరు, పంపా నదిపై ఏడాది పొడవునా రాజవరం, గజపతినగరం, వెంకటనగరం, రాజానగరం, పెంటకోట, రత్నయ్యం పేట గ్రామాలకు చెందిన సుమారు 450 కుటుంబాలకు చెందిన మత్స్యకారులు వేట సాగిస్తుంటారు.

అయితే పంపా నదిని ఆనుకొని ఏర్పాటు చేసిన రొయ్యల చెరువులు, పరిశ్రమలు విడుదల చేస్తున్న వ్యర్థ జలాల కారణంగా వెంకటనగరం, రాజానగరం గ్రామాల్లో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. మత్స్యసంపద మృత్యువాత పడి మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారు. ఇక ఈ నీటిని సేవించిన ప్రజలు రోగాల పాలవుతున్నారు. పశువులకూ వ్యాధులు సోకుతున్నాయి. అలాగే సమీప పంట భూములు ఉప్పుతేరి పోతున్నాయి. పంటలు పండక రైతులు నష్టపోతున్నారు. గ్రామంలోని స్మశానమంతా ఊబిలా మారిపోయింది. వాస్తవానికి రొయ్యల చెరువులు వ్యర్థాలను విడుదల చేసే క్రమంలో శుద్ధి చేసి మాత్రమే విడుదల చేయాలి. అలా కాకుండా రసాయనాలతో కూడిన వ్యర్థాలను నేరుగా విడుదల చేస్తున్నారు. ఫలితంగా మత్స్యకారులకు ఉపాధికి ముప్పుగా మారడమే కాకుండా అటు రైతులు, ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తోంది.

వ్యర్థాలను అరికట్టాలని మత్స్యకారుల డిమాండ్

రొయ్యల చెరువులు, పరిశ్రమల కారణంగా ఉప్పుటేరులో తరుచూ మత్స్య సంపద మృత్యువాత పడుతున్నాయని వెంకటనగరం గ్రామానికి చెందిన వంకా శివ, వంకా హరి, సూరాడ త్రినాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. రొయ్యల చెరువులు, పరిశ్రమలపై అధికారులు విచారణ నిర్వహించి, వ్యర్థాలను ఉప్పుటేరులో వదలకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు ఇవ్వాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

ఇక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధి పనుల కోసం టీటీడీ నిధులు వినియోగించకూడదని బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు ప్రకటనలు చేయడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. ప్రపంచంలో అన్ని ప్రాంతాల నుంచి తిరుపతికి రోజుకు 70 వేల నుంచి లక్ష మంది భక్తులు వస్తుంటారని, వారందరికీ వసతులు, వాహనాల పార్కింగ్ సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత టీటీడీపై ఉందన్నారు. తిరుపతిలో దేవస్థానం భవనాలు అత్యధికంగా ఉన్నందున...వాటి నిర్వహణ బాధ్యతలు దేవస్థానమే భరించాలని నారాయణ స్పష్టంచేశారు. ముఖ్యంగా తిరుపతిలో రోడ్లు, పారిశుధ్యం బాగోగులు కూడా టీటీడీ చూసుకోవాల్సి ఉందన్నారు. బీజేపీ తప్పుడు ప్రకటనలు చేసి టీటీడీని తప్పుదారి పట్టిస్తే ప్రజా ఉద్యమం ద్వారా బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు.

మహిళాభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యం

విజయవాడ నగర మహాసభలో అక్కినేని వనజ

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): మహిళాభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షులు అక్కినేని వనజ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య విజయవాడ నగర 10వ మహాసభ చిట్టినగర్‌లోని శ్రీ కామాక్షి విశ్వ బ్రాహ్మణ కల్యాణ మంటపం అమరజీవి గుండు సావిత్రమ్మ ప్రాంగణంలో గురువారం జరిగింది. నగర నాయకులు ఓర్సు భారతి, డి.సీతారావమ్మ అధ్యక్షవర్గంగా వ్యవహించారు. అక్కినేని వనజ మాట్లాడుతూ దేశంలో మహిళల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. దీనిని చూస్తే ఆడపిల్లగా పుట్టడమే ఇబ్బంది కరమనే భావన కలుగుతోందన్నారు. మణిపూర్ దుర్మార్గాలే ఇందుకు ఉదాహరణలన్నారు. ఎన్ని చట్టాలు వచ్చినా వంటింటికే మహిళలు పరిమితమని ఆర్‌ఎస్‌ఎస్ నేత మోహన్ భగవత్, ప్రధాని నరేంద్ర మోదీ అంటు న్నారని, మతోన్మాద నాయకుల పెడధోరణులు, దుర్మార్గపు భావజాలాన్ని అర్థం చేసుకోవాలని వనజ విజ్ఞప్తి చేశారు. మహిళా సమాఖ్య మరింత చైతన్యవంతంగా ముందుకు కదలాలని, మహిళలకు నిరంతరం అండగా నిలవాలని సూచించారు. అసంఘటిత రంగం నుంచి అన్ని రంగాల్లోకి మహిళలు విస్తరించాలని, ఆ దిశగా కార్యక్రమాలు రూపొం దించుకోవాలన్నారు. విజయవాడ మహిళా సమాఖ్యకు గొప్ప చరిత్ర ఉందని గుర్తుచేశారు. సనాతన ధర్మం, సంప్రదా యాల పేరుతో మహిళలను అణగదొక్కేందుకు మోదీ సర్కారు కుట్ర చేస్తోందన్నారు. సనాతన ధర్మమంటే మళ్లీ సతీసహగమనాన్ని స్వాగతిద్దామా అని అక్కినేని వనజ ప్రశ్నించారు.

మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గా భవానీ మాట్లాడుతూ సీనియర్ నాయకుల ఉద్యమస్ఫూర్తితో, కమ్యూనిస్టు పార్టీ సహకారంతో మహిళలు ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. చరిత్ర తెలియని వారు కమ్యూ నిస్టులు ఎక్కడ అంటున్నారని, విజయవాడలోని కొండప్రాంతాలలో మెట్ల నిర్మాణం, లైట్లు, నీటి సదుపాయం, కొత్తపేట పోలీస్ స్టేషన్ ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలు మహిళా సమాఖ్య, కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలతోనే సాధ్యమయ్యాయని గుర్తు చేశారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ విజయవాడ నగరాభివృద్ధిలో మహిళా సమాఖ్య, కమ్యూనిస్టుల పాత్రను విస్మరించలేరని స్పష్టంచేశారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఏళ్లతరబడి పోరాటాలు చేయడం ద్వారా మహిళలు, కార్మికుల హక్కులు సాధించు కున్నామని, వాటిని కాపాడుకోవడం కోసం ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు.

మాజీ కార్పొరేటర్ ఇజ్జాడ లక్ష్మి ఇటీవల కరణించిన పార్టీ, మహిళా సమాఖ్య నాయకులకు సంతాపతీర్మానం ప్రతిపాదించగా సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. నగర మహిళా కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. రూ.500కే వంటగ్యాస్ ఇవ్వాలని, పేదలందరికీ ఇల్లు నిర్మించి ఇవ్వాలని, వృద్ధాప్య పింఛన్లను రూ.5వేలకు పెంచాలని, వికలాంగులకు రూ. 6 వేలు ఇవ్వాలని, మహిళలు, చిన్నారులపై దాడుల నియంత్రణకు నిఘా విభాగం ఏర్పాటు చేయాలని, పని ప్రదేశాల్లో మహిళల కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని, అశ్లీల చిత్రాల వెబ్‌సైట్లను నిషేధించాలని, సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలన్న తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. తొలుత మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు పల్లా దుర్గాంబ పతాకావిష్కరణ చేశారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఆర్.పిచ్చయ్య, షేక్ నజీర్ అభ్యుదయ గీతాలు ఆలపించారు. ఉప్పలపాటి రామచంద్రరాజు రాఘవమ్మ చారిటబుల్ ట్రస్ట్ భోజన ఏర్పాట్లు చేసింది. దాతల సహాయంతో మహిళా ప్రతినిధులకు 300 చీరలు పంపిణీ చేశారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శులు లంకా దుర్గారావు, నక్క వీరభద్రరావు, మహిళా సమాఖ్య సీనియర్ నాయకులు కొరగంజి దుర్గాంబ, నగర కార్యవర్గ సభ్యులు తమ్మిన దుర్గా, చింతాడ పార్వతీ, దుర్గాసి రమణమ్మ, అండమాన్ నాగమణి, లంక నాగమణి, డి.పుష్ప, మూలి ఇందిర వేదికపై ఆశీనులయ్యారు. నగర మహిళా, యువజన సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహం పథకానికి ఉత్తర్వుల జారీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల కోసం జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహం అనే నూతన పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రతిఏటా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు నగదు ప్రోత్సాహకాలను ఇవ్వనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. పూర్తి వివరాలను, నియమ, నిబంధనలను జీవో నంబరు-58లో పొందుపరిచారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ అధ్వర్యంలో ఈ ప్రోత్సాహాలను అందజేస్తారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీలో అర్హత పొందిన ఏపీ అభ్యర్థికి రూ.2 లక్షలు, మెయిన్స్‌లో అర్హత పొందిన వారికి రూ.50వేల చొప్పున నగదు ప్రోత్సాహకం ఇస్తారు. ఈ మొత్తాన్ని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటి) విధానంలో అభ్యర్థుల ఖాతాల్లో జమ చేస్తారు. ఇందుకోసం ప్రభుత్వం విధి విధానాలను ఖరారు చేసింది. అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించకూడదు. ఈ మేరకు వారి తల్లిదండ్రులతో వ్యక్తిగత పత్రం ఇవ్వాలి. ప్రభుత్వ ఉద్యోగులైతే వేతనం ధ్రువీకరణ పత్రం, ఐటీ పన్నుదారులైతే సంబంధిత రుజువు పత్రాలను జతచేయాల్సి ఉంటుంది.

వెంకటేశ్వరరావుకు పీహెచ్‌డీ అందజేస్తున్న డా.పి.పూర్ణచంద్రరావు, ఫ్యాకల్టీ ఎస్‌ఏ రహిమాన్

వెంకటేశ్వరరావుకు పీహెచ్‌డీ

నాగార్జున యూనివర్సిటీ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విద్యార్థి కొలిపాక వెంకటేశ్వరరావుకు వైస్ చాన్సలర్ పీహెచ్‌డీ డిగ్రీని నిర్ధారించారు. 'టూరిజం డెవలప్‌మెంట్ అండ్ ఇట్స్ ఇంపాక్ట్ ఆన్ కల్చర్' అంశంపై డాక్టర్ పూర్ణచంద్రరావు మార్గదర్శకత్వంలో వెంకటేశ్వరరావు పరిశోధన చేశారు. ఏపీలోని శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలలో ఆయన అధ్యయనం చేశారు.

ఉద్యమాలపై నిర్బంధమా?

రావులపల్లి రవీంద్రనాథ్ ఆగ్రహం

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: కార్మికుల ఉద్యమాలపై పోలీసు నిర్బంధాలు తగదని, ఈ మధ్యకాలంలో అక్రమ అరెస్టులు, నిర్బంధాలు తీవ్రతరమయ్యాయని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ విమర్శించారు. ఇలాంటి అరాచక విధానాలు మానుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఏఐట యూసీ ముఖ్య నాయకుల సమావేశం జిల్లా కన్వీనర్ కుండ్రపు రాంబాబు అధ్యక్షతన గురు వారం ఉదయం జరిగింది. రావులపల్లి రవీంద్రనాథ్, ఏఐటీయూసీ రాష్ట్ర కోశాధికారి బీవీవీ కొండలరావు హాజరయ్యారు. రవీంద్రరాథ్ మాట్లాడుతూ సామర్లకోటలో ముఖ్యమంత్రి సభకు అంగన్వాడీలను, ఆశా వర్కర్లను, ఆటో కార్మికులను, డ్వాక్రా మహిళలను బెదిరించి, భయపెట్టి తరలించారని ఆరోపించారు. సభకు రాకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు కోల్పోతారని బెదిరించడం రాష్ట్ర ప్రభుత్వ పతనానికి నిదర్శనమన్నారు. వైసీపీ సభలకు పార్టీ కార్యకర్తలను ఆహ్వానించుకుంటే తప్పులేదని, కానీ కార్మికులు, చిన్న ఉద్యోగులను బెదిరించడం మంచిది కాదని హితవు పలికారు. ముఖ్యమంత్రి సభలంటే ప్రజలు భయపడు తున్నారని ఆరోపించారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువులకు అను గుణంగా కనీస వేతనాలు ఇవ్వడంలో పాలకులు విఫలమయ్యారని రవీంద్రనాథ్ విమర్శించారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఆటో, హమాలీ, వీధివిక్రయ దారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొండలరావు మాట్లా డుతూ ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించాలని, బహిరంగ సభలు, ప్రదర్శనలు చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాను మూడు జిల్లాలుగా విభజించి నందున త్వరలో ఏఐటీయూసీ జిల్లా మహాసభలు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో సీపీఐ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నేతలు తోకల ప్రసాద్, వాసంశెట్టి సత్తిరాజు, సప్ప రమణ, వంగమూడి కొండలరావు, పెద్దిరెడ్ల సత్య నారాయణ, అన్నవరం, పప్పు ఆదినారాయణ, రామయ్య, అనిల్, రామకృష్ణ, పేపర్ మిల్ రామకృష్ణ, జీపీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ విశాఖ మకాం మార్పు

దసరాకు కాదు... డిసెంబరులో

విశాలాంధ్రబ్యూరో-విశాఖపట్నం: ఒకపక్క రిషికొండలో సీఎం క్యాంప్ కార్యాలయాన్ని అన్ని హంగులతో నిర్మిస్తుండగా... మరోపక్క సీఎం జగన్ విశాఖకు మకాం మార్చే తేదీ మరోసారి వాయిదా పడింది. ఆయన డిసెంబరులో మారబోతున్నారంటూ మరో అనధికారిక వార్త బయటకొచ్చింది. పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా సెప్టెంబరు నుంచి విశాఖలోనే కాపురం ఉంటానని ముఖ్యమంత్రి ఈ ఏడాది ఏప్రిల్‌లో శ్రీకాకుళం పర్యటనలో ప్రకటించారు. అయితే ఆ విధంగా జరగలేదు. గత నెలాఖరులో జరిగిన మంత్రిమండలి సమావేశంలో దసరాకు సీఎం విశాఖకు మారాలని నిర్ణయం తీసుకున్నట్లుగా ప్రభుత్వ ప్రతినిధులు కొన్ని మీడియా ఛానళ్లకు లీకులిచ్చారు. ఈ నెల 15 నుంచి 'విశాఖకు వందనం' పేరుతో నగరంలో కార్యక్రమాలు ప్రారంభించి, దసరాకు సీఎం విశాఖ వచ్చినపుడు ఘన స్వాగతం పలికేందుకంటూ ఒక ఐకాసను కూడా వైసీపీ పెద్దలు వెనక ఉండి ఏర్పాటు చేయించారు. ఇంత హడావుడి చేసి, ఇప్పుడు సీఎం దసరాకు కాదు డిసెంబరులో వెళతారనే మరో వార్త బయటకొచ్చింది. డిసెంబరు 21న జగన్ పుట్టినరోజున లేదా కొద్దిగా అటూఇటుగా విశాఖకు వెళతారని సమాచారం. కాగా మూడు రాజధానుల అంశానికి సంబంధించిన కేసుపై విచారణను సుప్రీంకోర్టు డిసెంబరుకు వాయిదా వేసింది. కోర్టులో ఎలాంటి నిర్ణయం వస్తుందో చూసిన తర్వాతే... సీఎం విశాఖకు వెళ్లడంపై స్పష్టత వస్తుందని కూడా చర్చ జరుగుతోంది.

చకచకా ఏర్పాట్లు

ఇక రిషికొండలో సీఎం క్యాంప్ కార్యాలయ నిర్మాణం చేపట్టారు. కొండపైన రెండు వరసల రహదారి కూడా నిర్మించారు. రాజధానిని అధికారికంగా విశాఖకు మార్చేందుకు హైకోర్టు తీర్పు అడ్డంకిగా మారడంతో దొడ్డి దారిలో సీఎం క్యాంప్ కార్యాలయంతో పాటు వివిధ శాఖల కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికే టూరిజం రిసార్ట్ పేరిట రుషికొండను బోడికొండ చేసి సుమారు రూ. 270 కోట్లతో ఆధునిక హంగులతో భవనాలు శరవేగంగా నిర్మించిన ప్రభుత్వం... వారంలో రెండు రోజులు విశాఖలో సీఎం జగన్ బస చేసేందుకు ప్రభుత్వం అత్యవసరంగా జీవో నెంబర్ 2004, 2015 ఉత్తర్వులను జారీ చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల పై సమీక్ష చేయడానికి సీఎం క్యాంప్ కార్యాలయం విశాఖలో ఏర్పాటు చేయిస్తున్నట్లు... సీఎంతోపాటు మంత్రులు, వివిధ శాఖల సీనియర్ అధికారులు అందుబాటులో ఉండాలని తాజా జీవోలో ఆదేశాలు జారీ చేశారు. విశాఖలో అవసరమైన వసతి భవనాల ఏర్పాట్లపై పట్టణ పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, సాధారణ పరిపాలన సర్వీసెస్ విభాగం కార్యదర్శి పోలా భాస్కర్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎస్ఎస్ రావత్ తో కమిటీని ప్రభుత్వం నియమించింది.

ఓబీసీ చైర్మన్‌తో గిడుగు రుద్రరాజు భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏఐసీసీ జాతీయ ఓబీసీ విభాగ అధ్యక్షుడు కెప్టెన్ అజయ్‌యాదవ్‌తో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు గురువారం ఢిల్లీలో భేటీ అయ్యారు. ఏపీలో బీసీ కులాల సంఖ్యా పరమైన అంశాలతో పాటు వారి ఆర్థిక, రాజకీయ స్థితి గతులపై, సీడబ్ల్యూసీ తీర్మానాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేలా ఏపీలో బీసీ కులాల జనగణనకు సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాలపైనా చర్చించారు. బీసీ కుల గణనకు కాంగ్రెస్ అధిష్ఠానం పూర్తి మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే.

సీపీఐ సీనియర్ నేత సోదెం మృతి

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: సీపీఐ సీనియర్ నాయకులు సోదెం వెంకటేశ్వరావు శ్వాసకోశ సంబంధిత వ్యాధితో గురువారం మృతి చెందారు. ఇటీవల సెలబ్రెల్ మలేరియా సోకడంతో ఇంటి వద్దనే ఉంటూ చికిత్స పొందుతున్నారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు జంగారెడ్డిగూడెంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందిన అనంతరం ఐదు రోజుల క్రితం ఇంటికి చేరుకోగా మరల అస్వస్థతకు గురవటంతో రెండు రోజుల క్రితం కన్నాపురంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోదెం వెంకటేశ్వరరావు మరణ వార్త తెలియగానే సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య బుట్టాయిగూడెం మండలంలోని కోపల్లెకు వెళ్లి వెంకటేశ్వర రావు భౌతికకాయంపై అరుణపతాకాన్ని కప్పి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మృతి సీపీఐకి తీరనిలోటుగా పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాం తాలపై మక్కువతో వెంకటేశ్వరరావు సీపీఐలో చేరి ఏజెన్సీ ప్రాంతంలోని అనేక పోరాటంలో పాల్గొని తనదైన ముద్ర వేశారు. 2006-2011 వరకు పీఆర్ గూడెం పంచాయతీ వార్డు సభ్యునిగా సీపీఐ తరపున సేవలందించారన్నారు. 2014 ఎన్నికల్లో పోలవరం నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థిగా పోటీ చేశారు. బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడి ప్రజా సమస్యల పరిష్కారానికి తుదిశ్వాస వరకు పోరాడారు. మర్లగూడెం, కంద్రికగూడెం, రెడ్డి కోపల్లి భూవివాదాల్లో ప్రజలకు అండగా నిలబడి పోలీస్ కేసులను సహితం లెక్కచేయకుండా సీపీఐ తరుపున సుదీర్ఘ పోరాటం చేసిన చరిత్ర ఆయనకు ఉందన్నారు.

స్టార్ హోటళ్ల నిర్మాణానికి 'టెక్ మహీంద్ర' సంసిద్ధం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తాడేపల్లి సీఎం నివాసంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను గురువారం టెక్ మహీంద్ర ఎండీ, సీఈవో సీపీ గుర్నాని కలిశారు. విశాఖపట్నం సహా మూడు ప్రాంతాల్లో స్టార్ హోటళ్ల నిర్మాణానికి మహేంద్ర గ్రూప్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఒక్కో హోటల్ నిర్మాణానికి రూ. 250 కోట్లు ఖర్చు చేయనున్నట్లు సీఎంకి మహీంద్ర గ్రూప్ ప్రతినిధులు వివరించారు. విశాఖ సహా మరో రెండు పర్యాటక ప్రాంతాల్లో స్టార్ హోటళ్ల నిర్మాణానికి మహీంద్ర గ్రూప్... వచ్చే రెండు నెలల్లో శంకుస్థాపనకు సమాయత్తమవుతున్నట్లు వెల్లడించారు. కాగా రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, ప్రోత్సాహకాలను వారికి సీఎం వివరించారు. ఈ సమావేశంలో మహీంద్ర గ్రూప్ గ్లోబల్ హెడ్, అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రెసిడెంట్ సీవీఎన్ వర్మ, క్లబ్ మహీంద్ర సీఓఓ సంతోశ్, రామన్, టెక్ మహీంద్ర విజయవాడ అడ్మిన్ మేనేజర్ బిరుదుగడ్డ జయపాల్ పాల్గొన్నారు.

రైతుభరోసా నమోదుకు 15వరకు అవకాశం

వ్యవసాయ శాఖ కమిషనర్ చేవూరి హరికిరణ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కొత్తగా వైఎస్ఆర్ రైతు భరోసా నమోదు చేసుకోవడానికి ఈ నెల 15 వరకు అవకాశం కల్పించినట్లు వ్యవసాయ శాఖ కమిషనర్ చేవూరి హరికిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా అర్హత సాధించిన రైతులకు వైఎస్ఆర్ రైతుభరోసా- పీఎం కిసాన్ పథకంలో నమోదుకు 15-10- 2023 వరకు అవకాశం కల్పించామని... ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ పథకం ప్రాముఖ్యతను కమిషనర్ వివరిస్తూ... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు ఆర్థిక చేయూత, వెసులుబాటు కల్పించడానికి నవరత్నాలలో భాగంగా వైఎస్ఆర్ రైతు భరోసా పీఎం కిసాన్ పథకాన్ని 2019 అక్టోబర్ 15 నుంచి అమలు చేస్తున్నట్లు గుర్తుచేశారు. నాలుగేళ్లుగా వరుసగా ఆర్థిక లబ్ధిని అర్హత కలిగిన రైతులందరికీ అందిస్తు న్నామన్నారు. పథకంలో భాగంగా రాష్ట్రంలో మిగిలిన, కొత్తగా అర్హులైన భూయజ మానులు, భూమిలేని కౌలు రైతు కుటుంబాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన వారు, దేవాదాయ భూములు, ఆటవీ భూమి సాగుదారులు రైతు భరోసా పోర్టల్ లో నమోదు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన వారికి రూ.13,500 చొప్పున మూడు విడతలలో ఆర్థిక సహాయం అందించడం జరు గుతుందన్నారు. అర్హత ఉండి, మొదటి విడత లబ్ధి పొందని వారంతా తమ పూర్తి వివరాలతో 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఇన్నేళ్లకు ఉత్తరాంధ్ర వెనుకబాటు కనిపించిందా?

జగన్‌కు ఎమ్మెల్యే గంటా సూటి ప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విలువైన ఆస్తులను దోచుకోవడానికి దొడ్డి దారిలో విశాఖ వస్తున్నారా? ఆయనకు ఉత్తరాంధ్ర వెనుక బాటు ఇప్పుడు కనిపించిందా? అని విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రశ్నించారు.

గురువారం ఆయన విశాఖలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ... రాజధానిని దొడ్డిదారిలో తరలించేందుకు ఉత్తరాంధ్ర వెనుకబాటు పేరుతో చీకటి జీవో విడుదల చేశా రని మండిపడ్డారు. ఉత్తరాంధ్ర వెనుకబాటు నాలుగున్నరేళ్లకు గుర్తుకొచ్చిందా అని ప్రశ్నించారు. ఇంత కాలం జగన్ ఉత్త రాంధ్ర అభివృద్ధి కోసం చేసింది శూన్యం అన్నారు. విశాఖకు పరిపాలన రాజధాని తరలిస్తామన్న ప్రకటన తప్ప విశాఖ నగర అభివృద్ధిని కూడా పట్టించుకోలేదన్నారు. హైకోర్టు తీర్పు అడ్డంకిగా మారడంతో దొడ్డిదారిన రాజధానిని తరలిస్తు న్నారని, ఇక అమరావతిలో మిగిలేది సాధారణ ఉద్యోగులు మాత్రమేనన్నారు. ప్రభుత్వ రికార్డుల్లో అమరావతే రాజధాని అని, వైసీపీ నేతలకు మాత్రం విశాఖ రాజధాని అన్నారు. రుషికొండపై పర్యాటక శాఖకు చెందిన 65 ఎకరాల్లో విదేశీ, స్వదేశీ పర్యాట కులను ఆకట్టుకునేలా సమీకృత పర్యాటక సముదాయం నిర్మిస్తున్నట్లు ప్రకటించి నమ్మబలికారని... రుషికొండలో ఏం జరుగుతోందో ఎవ్వరికీ తెలియకుండా ఇనుప రేకులతో కంచె ఏర్పాటు చేసి గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు పూర్తి చేశారన్నారు. తాజాగా కంచె ముసుగు తొలగించి ప్రవేశ ద్వారం, ప్రహరీ నిర్మాణాల పనులు బాహాటంగానే చేపడుతు న్నారన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిని పర్యవేక్షించాలని, ఉన్నతాధికారులు కూడా అందుబాటులో ఉండాలని జీవో తేవడం లో ఉన్న మర్మమేంటో ఉత్తరాంధ్ర ప్రజలందరికీ తెలుసునని గంటా అన్నారు. చంద్రబాబు అరెస్ట్ తనకు తెలియదంటూ వెకిలినవ్వు నవ్వినప్పుడే జగన్‌మోహన్ రెడ్డి గారి విషస్వభావం బయటపడిందన్నారు. చంద్రబాబు ని జైల్లో పెట్టి, జగన్ వికృతానందాన్ని పొందుతున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికలు పేదలకు... పెత్తం దారులకు మధ్య జరిగే యుద్ధమేనన్న గంటా... ఇంతకీ పేదవాడు ఎవరో, పెత్తందారుడు ఎవరో రాష్ట్ర ప్రజలకు జగన్ చెప్పాలన్నారు. దేశంలోని ముఖ్య మంత్రులందరికంటే ధనవం తుడైన ముఖ్యమంత్రి పేదవాడా? పెత్తందారుడా?...

రాష్ట్రంలో దిక్కుకొక ప్యాలెస్ ఉన్నవాడు పేదవాడా? పెత్తం దారుడా?... లక్షలకోట్ల ప్రజా ధనాన్ని అనుభవిస్తున్న వాడు పేదవాడా? పెత్తందారుడా ? అని ప్రశ్నించారు. జగన్‌కు నిజంగా విశాఖ మీద ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే రాజధాని పై ఒపీనియన్ పోల్ నిర్వహించి విశాఖ ప్రజల మనోగతం తెలుసుకోవాలని గంటా సవాల్ చేశారు. నూటికి 90% మంది వ్యతిరేకిస్తారన్నారు. 2024లో విశాఖ నుంచే వైసీపీకి శాశ్వతంగా రాజకీయ సమాధి కట్టడం తథ్యం అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు , విశాఖ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్‌బాబు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని పారిశుధ్య కార్మికులు, స్కావెంజర్ల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై శ్రీలక్ష్మీ తెలిపారు. సమాజంలో అందరితో సమానంగా వారికి గుర్తింపు, ఆత్మగౌరవం పెంపొందించడమే ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా వారి సంక్షేమానికి అడుగులు వేస్తున్నామని చెప్పారు. గురువారం తాడేపల్లి పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సమావేశ మందిరంలో పారిశుధ్య కార్మికుల సంక్షేమం, అభివృద్ధిపై స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన తడి, పొడి చెత్త విషయంలో ప్రజల సహకారం సరిగా లేకపోవడం వల్ల చెత్తను వేరుచేసేందుకు పారిశుధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పారిశుధ్య నిర్వహణ, సఫాయి కార్మికుల విషయంలోనూ ప్రజల్లో మార్పు రావాల్సిన అవసరముందని చెప్పారు. మాన్యువల్ స్థానంలో యంత్రాల వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ గంధం చంద్రుడు మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్ల తర్వాత కూడా స్కావెంజర్ల వ్యవస్థ బాధాకరమన్నారు. రాష్ట్రంలోని సఫాయి కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ మాట్లాడుతూ సామాజిక పరిశుభ్రత అనేది మనందరి బాధ్యత అని అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ సూర్యకుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఎండీ చిన్నరాముడు, సఫాయి కార్మిక ఆందోళన్ ప్రతినిధి విల్సన్ తదితరులు ఈ సమావేశంలో ప్రసంగించారు. సమావేశంలో పాల్గొన్న వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పారిశుధ్య కార్మికుల సంక్షేమం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రభుత్వానికి అనేక సూచనలు చేశారు.

సంపాదకీయం

అవినీతిని బయట పెట్టిన అధికారులకు బదిలీ శిక్ష

భారత్ మాలా పథకం కింద ప్రతి కిలో మీటర్ రోడ్డు నిర్మాణానికి రూ.18.50 లక్షలు వెచ్చించడానికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల కాబినెట్ కమిటీ ఆమోద ముద్ర వేసింది. ఆచరణ దగ్గరకు వచ్చేసరికి ఈ ఖర్చు ప్రతి కిలో మీటర్‌కు 250 కోట్ల రూపాయలు అయికూర్చుంది. పెంచిన ఈ వ్యయానికి ఆర్థిక వ్యవహారాల కాబినెట్ కమిటీ ఆమోదించిన దాఖలాలు అయితే లేవు. ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జాతీయ ఆరోగ్య యోజనదీ అదే తంతు. ఒకే టెలిఫోన్ నెంబర్ మీద 1.57 లక్షల రూపాయల బీమా సొమ్ము పొందారు. అంటే ఈ సొమ్మంతా అవినీతిపరుల ఖాతాల్లో చేరిపోయి ఉంటుంది. జాతీయ రహదారుల వ్యవస్థ 2017-18 నుంచి 2020-2021 మధ్య రోడ్లను వినియోగించుకునే వారినుంచి వసూలు చేయవలసిన దానికన్నా రూ. 22.10 కోట్లు అదనంగా టోల్ గేటు సుంకం వసూలు చేశారు. దక్షిణ భారతదేశంలో ఉదాహరణ ప్రాయంగా 41 టోల్ ప్లాజాల గురించి దర్యాప్తుచేస్తే వినియోగదారుల నుంచి రూ.132.05 కోట్లు ప్లాజాల నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేశాయని తేలింది. ఆరోగ్య బీమా విషయంలోనూ ఇదే తంతు. 2.25 లక్షల కేసుల సందర్భాలలో శస్త్ర చికిత్స చేశారంటున్న తేదీ వారిని ఆసుపత్రి నుంచి పంపించిన తేదీ తరవాత చూపించారు. అంటే అక్రమానికి పాల్పడదలచుకున్నా దొంగకూ కొన్ని నియమాలు ఉంటాయన్న కనీస ఇంగితం లేకుండా దోపిడీ కొనసాగింది. ఈ రకంగా ఒక్క మహారాష్ట్రలోనే 1.79 లక్షల ఉదంతాలు కనిపించాయి. ఈ రకంగా రూ.300 కోట్లు అదనంగా బీమా డబ్బు చెల్లించేశారు. ఈ లొసుగులన్నింటినీ బయట పెట్టిన ముగ్గురు సీనియర్ కాగ్ అధికారులను సెప్టెంబర్ 12వ తేదీన గుట్టు చప్పుడు కాకుండా బదిలీ చేసేశారు. అంటే తమ ఏలుబడిలో కొనసాగిన అవినీతిని బయటపెట్టి తమ నిజాయితీని ప్రదర్శించిన చిత్తశుద్ధితో పనిచేసే అధికారులను బదిలీ పేరుతో అప్రధానమైన బాధ్యతలు నిర్వహించడానికి తలోమూల విసిరేశారు. కాగ్ సమర్పించిన 12 కీలకమైన నివేదికలను గత వర్షాకాల సమావేశాల చివరలో పార్లమెంటులో ప్రతిపాదించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత కాగ్ నివేదికలు అరుదుగానే పార్లమెంటుదాకా వస్తున్నాయి. తమ అవినీతిని బయటపెట్టిన అతూర్వ సి ణా, దత్త ప్రసాద్ సూర్యకాంత్, అశోక్ సి ణా హాకు మోదీ ప్రభుత్వం బదిలీ దండన విధించింది. తమ పాలనలోని అవినీతిని బయటపెట్టిన నిజాయితీగల కాగ్ అధికారులను అవినీతిలో మునిగి తేలే మోదీ ప్రభుత్వం ఎలా సహిస్తుంది? ప్రస్తుతం కాగ్ అధిపతి గిరిశ్ చంద్ర ముర్ము గుజరాత్‌కు చెందిన ఉన్నతాధికారి. ఆయన మోదీకి, అమిత్ షాకు అత్యంత సన్నిహితుడు. అయినా ముక్కు సూటిగా తమ బాధ్యతలు నిర్వర్తించే అధికారులను మోదీ ప్రభుత్వంలో అవినీతిని బయట పెట్టకుండా నిరోధించలేకపోయారు. అయితే మోదీ ప్రభుత్వం తమ ప్రయోజనాలను పరిరక్షించలేని కాగ్ అధిపతిని శిక్షించలేదు. ఆయన కింద పనిచేసి లొసుగులు ఎత్తి చూపిన ముగ్గురు అధికారులను బదిలీ చేసేసింది. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న ఎన్.డి.ఎ. ప్రభుత్వ హయాంలో అవినీతి జరిగిందన్న ఏ ఆరోపణనైనా మోదీ సర్కారు అంగీకరించదు. వాస్తవాన్ని అంగీకరించే నైతిక శక్తి బీజేపీకి ఉంటేగా! అసలు ఉండదు ఎందుకంటే తమది మచ్చలేని పాలన అన్న భ్రమ మోదీ ప్రభుత్వంలో గూడు కట్టుకు పోయింది. విభిన్నమైందనుకునే బీజేపీ పాలనలోనూ ముగ్గురు కాగ్ అధికారులు అవినీతి ఉందని అమాయకంగా లెక్కలతో సహా బయటపెట్టిన అధికారులను బదిలీ చేసేసి మోదీ ప్రభుత్వం పంచతంత్ర కథల్లో చాంద్రాయణ వ్రతంచేసే పిల్లిలా తన భ్రమలో తాను జీవిస్తూ ఉంటుంది.

రైల్వే మంత్రిత్వ శాఖకు కేటాయించిన డబ్బును మించి అపారమైన ధనాన్ని దర్జాగా ఖర్చు పెట్టేసింది. ఈ విషయాలు కూడా కాగ్ నివేదికలో బయటపడ్డాయి. కేంద్ర మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాలు ఖర్చుపెట్టే ప్రతి పైసాకు మాత్రమే కాకుండా మొత్తం ప్రభుత్వం ఖర్చుపెట్టే ప్రతి పైసాకు పార్లమెంటు ఆమోదం ఉండాలి. బడ్జెట్‌లో కేటాయించిన దానికన్నా ఎక్కువ ఖర్చయితే ఆ విషయాన్ని పార్లమెంటు ముందుంచి ఆమోదం పొందాలి. పార్లమెంటుమీద ఇసుమంత గౌరవం కూడా లేని మోదీ ప్రభుత్వానికి ఇలాంటి నియమాలు పట్టవు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రైల్వే మంత్రిత్వ శాఖకు కేటాయించింది మొత్తం రూ. 23, 885.47 కోట్లు. అలాగే 2020-21లో రూ. 23,885.47 కోట్లు కేటాయిస్తే ఆమోదం లేకుండానే రైల్వే శాఖ 8,127. 97 కోట్లు అదనంగా చేతికి ఎముక లేనట్టు ఖర్చు పెట్టేసింది. అదే రీతిలో పర్యాటక శాఖకు స్వదేశీ దర్శన్ పథకం కోసం రూ.500 కోట్లు కేటాయిస్తే 2016-17 నాటికే రూ.4000 కోట్లు అదనంగా ఖర్చు పెట్టేసింది. యు.పి.ఎ. హయాంలో కాగ్ అధిపతిగా వినోద్ రాయ్ ఉన్న సమయంలో 2జి, కామన్వెల్త్ క్రీడల కుంభకోణాల్లాంటివి రోజుకొకటి వెలికి వచ్చేవి. ఆ కారణంగానే కాగ్ అంటే ఏమిటో అందరికీ తెలిసొచ్చింది. కాగ్ అధికారులన్నా నిజాయితీగా పనిచేస్తారన్న నమ్మకం కుదిరింది. ఆ నివేదికలో చెప్పిన విషయాలన్నీ నిజంకాదని తరవాత తెలిసింది. "నేను అకౌంటెంట్‌ను కాదు" అని వినోద్ రాయ్ గ్రంథం కూడా రాసి తన రుజువర్తనను చరిత్రకెక్కించారు కూడా. యు.పి.ఎ. హయాంలో అవినీతి పేరుకుపోయిందని, ముఖ్యంగా 2009లో కాంగ్రెస్ నాయకత్వంలో యు.పి.ఎ. రెండోసారి అధికారంలోకి వచ్చిన తరవాత అవినీతి అడ్డులేకుండా పెరిగిందన్న ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణల్లో ప్రముఖమైన 2జి కుంభకోణం, కామన్వెల్త్ క్రీడల కుంభకోణం ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ నాయకత్వంలోని "అవినీతికర ప్రభుత్వానికి" వ్యతిరేకంగా అన్నా హజారే నాయకత్వంలో పెద్ద ఉద్యమం చెలరేగింది. అందులో ప్రసిద్ధ సామాజిక కార్యకర్తలు కూడా భాగస్వాములయ్యారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ హఠాత్తుగా ప్రధానమంత్రి అభ్యర్థిగా రంగప్రవేశం చేశారు. ఇతర పార్టీలకు, ముఖ్యంగా కాంగ్రెస్‌కు మీరు 60 ఏళ్లు అధికారంలో ఉండడానికి అవకాశం ఇచ్చారు. నాకు కేవలం 60 నెలలు అధికారంలో ఉండే అవకాశంఇస్తే ఈ అవినీతి పంకిలాన్ని కడిగేసి దేశమంతటా ముగ్గులు పెడతానని వాగ్దానం చేశారు. అవినీతి రహిత సర్కారు మోదీ ఏర్పాటు చేయగలరన్న భ్రమతో ఓటర్లు ఆయనను అందలం ఎక్కించారు. విదేశీ బ్యాంకుల్లో డబ్బు దాచుకున్న రాజకీయకుల దగ్గర నుంచి ముక్కు పిండి పైసాతో సహా వసూలుచేసి ప్రతి ఒక్కరి ఖాతాలో 15 లక్షలు వేస్తానన్న బూటకాన్ని కూడా నమ్మారు. తరవాత ఎహ్హెహ్హే ఇది ఎన్నికల వాగ్దానం అని వికటాట్టహాసం చేశారు. ఇవన్నీ బూటకపు వాగ్దానాలకింద మిగిలిపోయాయి. తమది అవినీతి మచ్చ అంటని ప్రభుత్వమని మోదీ ఇప్పటికీ ఊరారా తిరిగి ప్రచారం కొనసాగిస్తుంటుంది. చెరువులోని చేపలు బయటపడే పరిస్థితి ఎదురైతే దానికి దేశ భద్రత ముసుగు కప్పేస్తారు.

సజీవ సంస్కృతి అవసరం

పరిణామక్రమంలో మానవాకారం వచ్చిన తరువాత తనకంటే పరిమాణంలో పెద్దగా ఉన్న కొండలు, చెట్లను చూచి భయపడ్డాడు. అందుకా బావ కొండకు, చెట్లకు మొక్కాడు. తన ప్రాణం కాపాడు కోవడానికి భయపడిన ప్రతిదానికి మొక్కాడు. జంతువులను చంపి గుహల్లో నిద్రించి కనపడిన పండ్లు తిని జీవనం సాగించాడు. భయపడిన మనిషికి మతం ఆసరాగా మారి మనిషిని తన గుప్పెట్లో పెట్టుకుంది. వేల సంవత్సరాలుగ గడిచిపోయినప్పటికీ 90శాతం పైగా మత నిర్దేశకులు చేతుల్లో కీలుబొమ్మలుగమారి జీవనంసాగిస్తున్నారు. ఈ పరిస్థితి ప్రపంచమంతటా ఉంది. మత ప్రభావాన్ని తక్కువ అంచనా వేయడానికి వీలులేదు. అటువంటి మతప్రభావంనుండి బైటపడకుండా సాంఘికంగా, ఆర్థికంగా మార్పు వచ్చినా అది సజీవ సంస్కృతి కాజాలదు. నిజమే మతస్థులలో 90శాతం మందికి మత సిద్ధాంతాలు తెలియకపోయినా ఆ మత సిద్ధాంతాలను బట్టి నడవడికను ప్రతి మతసిద్ధాంతం ప్రతిపాదించి ఆచరణలో పెట్టింది. ప్రతి మతస్థుడు ఆచరిస్తూనేఉన్నాడు. ఏ రాజకీయ, ఆర్థిక హెూదాకు చెందినా అతని జీవనవిధానాన్ని నిర్ణయించేది మత సిద్ధాంతమే. మానవుని దినచర్యలో అతని జీవన విధానాన్ని నిర్ణయించేది అతని మతాలోచన మత సిద్ధాంతమే. నిజమే, బావ ఈ మత సిద్ధాంతాలను నేటి ఆధునిక విజ్ఞానశాస్త్ర పద్ధతి అవతరించకముందే



రూపొందించినవే. విజ్ఞానశాస్త్రం రూపొందించిన తాత్విక ఫలితాలను అన్ని కులాలవారు అనుభవిస్తున్నారు తప్ప ఆమోదించరు. అలా ఆమోదిస్తే ఆ మత సిద్ధాంతాలన్ని రద్దు కావలసిందే. ఒక మత సిద్ధాంతం మరో మతం ఆమోదించదు. కాని శాస్త్రాల విషయం అలాకాదు. శాస్త్రం అందించిన సత్యం విశ్వజనీనం. అదే సత్య మవుతుంది. ఆ విధంగా విశ్వజనీన తత్వం నిర్మించు కోవలసిన దశలో వివిధసమాజాలు శాస్త్ర విరుద్ధ అంశాలను ఆమోదిస్తున్నాయి. పరస్పర విద్వేషాలను రెచ్చగొడుతున్నాయి. ఏ ఒక్క మతసిద్ధాంతం మౌలికమైన మార్పుల్ని అంగీకరించదు. దానివల్ల 21 శతాబ్దంలోని మనిషి 20శతాబ్దాల కిందటి అసంబద్ధ భావాలతో సతమత మవుతున్నాడు. ఇప్పటికి మానవ జీవితంలో మౌలికంగా మార్పురాలేదు. అధునిక విజ్ఞాన శాస్త్ర నిర్ణయాలకు అనుగుణంగా మానవ విలువలలోను తత్వంలో మార్పు రావాలి. కేవలం రాజకీయ, ఆర్థిక, మార్పులవల్ల వ్యవస్థమారదు. విద్వేష మనస్తత్వం మతవారసత్వమే. అందుకు ఇటీవల ఉదయనిధిపై మతస్తుల ప్రేలాపనే నిదర్శనం. ఆధునిక విజ్ఞానానికి అనుగుణంగా తత్వం మారుతుంది. అది నిత్యం మారుతూనే ఉంటుంది. కాని ఎన్నివేల సంవత్సరాలు గడిచినా మతనిర్దేశకాలం నిర్ణయాలు మారవు. శాస్త్ర మార్పుకు అనుగుణంగా మారేతత్వమే మానవజీవన తత్వం కావాలి. అందుకు అనుగుణంగా రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థలు మారుతూ ఉండాలి. లేకపోతే మానవాభ్యుదయంలో పురోగతి ఉండదు. అధికారం ఆర్థిక సంపత్తి ఎటువంటి వారిదగ్గర చేరుతున్నవో మనకు తెలుసు. సమాజానికి కావలసిన మార్పులు వారు చేస్తారనుకోవడం భ్రమగా మిగులుతుంది. శాస్త్ర రీత్యా మారుతున్న భావాలు నైతికనీతి సమాజానికి అవసరం. అలా మారిన భావాలకు అవకాశం ఇవ్వకుండా ఆర్థిక అవకాశాలున్నవారే ప్రణాళికలు రూపొందిస్తే మరికొన్ని కొత్త మతాలు పుట్టడం తప్ప, సమాజానికి మేలు జరగదు. 19వ శతాబ్దంలో పుట్టిన నియంతృత్వ సిద్ధాంతాలు ఇప్పటికీ అకర్షణీయంగా అమలు జరుగు తున్నాయి. అవి ప్రజలకు ఎలా ఉపయోగపడుతున్నవో తెలిసిన విషయమే. ఇప్పటికీ ఆ భ్రమలను నమ్మితే మనల్ని మనం వంచించు కోవడమే. దీనికంతటికి కారణం మత సమాజంలో పుట్టి కులసమాజంలో పెరగటమే బావ. ముఖ్యంగా హిందూమత ప్రభావం మన దేశంలో అన్యమతాల వారి మీద కొంతైనా లేదనలేం. అందుకు హిందూమత వాదులు ఆ మతాన్ని పోషించే రాజకీయాలు కారణం. నిజమే దేవుడు మనల్ని నాల్గు వర్ణాలుగ విభజించాడని హిందువాదులంటారు అన్ని దేశాలలో మతాలు, దేవుళ్లు ఉన్నారు. కాని ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేవుడు ఒక్క మన దేశంలోనే నాల్గు వర్ణాలుగా విభజించాడనడం హాస్యాస్పదం. గీతా పారాయణంచేసే రుషి పుంగవులకు ఈ సంశయాలు రావు. ఒక్క భారత దేశానికి మాత్రమే దేవుడు వేదాలు ఇచ్చాడని నమ్మేవారికి సందేహాలు రావడానికి అవకాశంలేదు. ఎంతో గొప్పదని పొగుడుకుంటున్న హైందవచరిత్రలో హిందువులుగ పరిగణించబడేవారిలో ఎంతోమందికి హిందూ సంస్కృతి, హిందూ ధర్మం అంటే ఏమిటో తెలియదు. ఎక్కువమంది అన్నదే కరెక్టు అనే మంది మనస్తత్వం రానురాను ప్రమాదకరంగా మారుతోంది. దానివల్ల మతం, కులం బలాలు లేకపోతే రాజకీయం లేదన్నట్లుగ మారింది. కుల, మత ప్రలోభాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడం రాజకీయాల్లో అవసరంగా మారింది. ఇటువంటి సంస్కృతి కాకుండా సజీవ సంస్కృతి అవసరం.

పెరిగిన అప్పులు - పన్నులు...!

ఎం కోటేశ్వరరావు

తమ పాలన వెలిగిపోతున్నదని చెబుతున్న నరేంద్రమోదీ సర్కార్ సెప్టెంబరు చివరి వారంలో ప్రజలకు రెండు "శుభవార్తలు" చెప్పింది. ఒకటి వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి ఐదు మాసాల్లో ద్రవ్యలోటు రు.6.43లక్షల కోట్లకు పెరిగింది. బడ్జెట్‌లో సూచించిన మొత్తం కంటే ఎక్కువగా రిజర్వుబాంకు మిగులు నుంచి రు.87,420 కోట్లు బదలాయించిన తరువాత కూడా ఇలా జరిగింది. గతేడాది ఈ మొత్తం రు.5.42లక్షల కోట్లు. సులభంగా చెప్పుకోవాలంటే నిర్మలా సీతారామన్ ఆర్థికశాఖ మంత్రిగా 2023-24 బడ్జెట్‌ను ప్రవేశపెట్టినపుడు వచ్చే పన్నెండునెలల్లో ఒక వంద రూపాయలు కొత్తగా ద్రవ్యలోటు ఉంటుందని ప్రతిపాదించారని అనుకుందాం. అది ఐదు నెలలకే 36 రూపాయలకు చేరింది, అదే కాలానికి గత ఏడాది రు.32.60 మాత్రమే ఉంది. గతేడాది మొత్తం లోటు రు.16.61లక్షల కోట్లు కాగా, వర్తమాన సంవత్సరంలో రు.17.86 లక్షలుగా ప్రతిపాదించారు. మొత్తం పెరుగుదల లక్షా 25వేల కోట్లు. ఇప్పటికే లక్ష కోట్లు పోగా ఇంకా మిగిలింది 25వేల కోట్లు మాత్రమే. వచ్చే ఏడు నెలల్లో ఏ పథకానికి కోత పెడతారు, కొత్త అప్పులు తెస్తారా, కొత్త నోట్లను ముద్రిస్తారా ఏం చేస్తారన్నది చూడాలి. నరేంద్రమోదీకి సర్వాధికారాలు ఉన్నాయి కదా ! ఏం చేసినా అడిగేవారు లేరు. నోట్ల ముద్రణ జరిగితే ధరలు మరింతగా పెరుగుతాయి, రూపాయి విలువ పతనం అవుతుంది.

ఇక రెండవ మంచి వార్త ఏమంటే మన విదేశీ రుణభారం 2023 జూన్ నాటికి 629.1 బిలియన్ డాలర్లకు పెరిగింది. తమ విశ్వగురువు విదేశీ రుణాల మీద ఆధారపడరని, తగ్గిస్తారని భక్త జనులు అధికారానికి వచ్చిన తొలి రోజుల్లో ప్రచారం చేశారు. 2014లో మోదీ అధికారానికి వచ్చినపుడు 2013 డిసెంబరు నాటికి ఉన్న విదేశీ రుణం 409.4 బిలియన్ డాలర్లు మాత్రమే. దానిలో తీర్చింది తీర్చగా ఆ మొత్తం అలాగే ఉందనుకుంటే అదనంగా 220 బిలియన్ డాలర్లు కొత్త అప్పులు చేశారు. ఇది ప్రతి మూడు నెలలకు పెరుగుతున్నది తప్ప తగ్గటంలేదు. ఈ ఏడాది మార్చి నాటికి 624.3 బిలియన్ డాలర్లకు అదనంగా 470 కోట్ల డాలర్లు తోడైంది. దీన్ని మోదీ సర్కార్ వైఫల్యంగా చెబుతారా, ఘనత అంటారా? గతంలో వాజ్‌పాయి ఏలుబడిలో, యుపిఏ హయాంలో కూడా అప్పులు గణనీయంగా తీసుకున్నారు. విదేశీ రుణాలన్నీ డాలర్లలో ఉండవు. 1991లో మన విదేశీ రుణం 83.8 బిలియన్ డాలర్లు కాగా దానిలో రాయితీలతో కూడిన మొత్తం 45.9శాతం ఉండేది. అది తరువాత క్రమంగా తగ్గుతూ 2013నాటికి 11.1కి 2022 డిసెంబరు నాటికి 8.1శాతానికి తగ్గింది.

అంకెలతో జనాన్ని తిమ్మిని బమ్మిని చేయవచ్చు. దానిలో భాగంగానే విదేశీ అప్పు మొత్తం పెరిగిందని ఒకవైపు అంగీకరిస్తూనే మార్చినెలతో

ముగిసినదానితో పోలిస్తే జూన్ నాటికి జిడిపిలో అప్పు శాతం 18.8 నుంచి 18.6 శాతానికి తగ్గినట్లు ఆర్‌బిఐ చెబుతోంది. ప్రభుత్వ అప్పు తగ్గింది, ప్రభుత్వేతర అప్పు పెరిగిందని కూడా పేర్కొన్నది. గతంలో కూడా ప్రభుత్వ అప్పు తగ్గింది తప్ప పెరగలేదు. . ఇతర దేశాలతో పోలిస్తే మన అప్పు తక్కువ అని మరోసన్నాయి నొక్కు. ప్రతిదానికి చైనాతో పోలుస్తున్నారు, చైనా విదేశీ అప్పు జీడీపీలో 13.6శాతం కాగా దాని కంటే మన అప్పు ఆరుశాతం ఎక్కువ. ఇంటా బయటా అప్పులుచేసి, ప్రైవేటు అప్పులకు హామీ ఇచ్చి సాధించింది ఏమిటి ? కాంగ్రెస్ యాభై సంవత్సరాలలో చేయలేనివాటిని తన తొలి ఐదు సంవత్సరాల పాలనలోనే సాధించినట్లు నరేంద్రమోదీ చెప్పుకున్నారు. అందువలన పదేండ్ల కాలం తక్కువేమీ కాదు. కేంద్రంలో, మెజారిటీ రాష్ట్రాలలో బీజేపీ అధికారంలో ఉంది. విధానాలను అమలు జరపటానికి వచ్చిన ఇబ్బంది లేదు. ఒక దేశ అభివృద్ధికి ఒక కొలమానం మానవాభివృద్ధి సూచిక. ఐరాస అభివృద్ధి ప్రమాణాల(హెచ్‌డిఐ) ప్రకారం 0.550 కంటే తక్కువ పాయింట్లు వచ్చిన దేశాలు తక్కువ. 0.550-0.699 మధ్య ఉన్నవి మధ్యరకం, 0.699 నుంచి 0.799 పాయింట్లు వస్తే ఉన్నత, 0.800 కంటే మించితే అత్యున్నత వృద్ధి సాధించిన దేశాలుగా పరిగణిస్తున్నారు. ఈ ఏడాది ప్రకటించిన 2022 నివేదిక ప్రకారం, 0.633 పాయింట్లతో మనదేశం 188 దేశాల జాబితాలో 132వదిగా ఉంది. నరేంద్రమోదీ అధికారానికి వచ్చినపుడు ఉన్న 130 నుంచి రెండు స్థానాలు దిగజారింది. మన దేశం ఇచ్చిన సమాచారం ప్రకారమే విశ్లేషించి సూచికలను రూపొందిస్తారని తెలిసిందే.

తన పాలనలో జీడీపీ గణనీయంగా పెరిగిందని, త్వరలో ఐదు లక్షల కోట్ల డాలర్లకు చేర్చుతామని, 2047 నాటికి చైనాను కూడా అధిగమిస్తామని బీజేపీ నమ్మింప చూస్తున్నది. రాష్ట్రాలు రుణాలు తీసుకోవద్దని, సంక్షేమ పథకాలకు అనవసరంగా ఖర్చు చేయవద్దని ప్రధాని నరేంద్రమోదీ పదే పదే చెబుతున్నారు. 2013-14 సంవత్సరంతో పోల్చితే 2022-23నాటికి స్వదేశీ అప్పు 174శాతం, విదేశీ అప్పు వందశాతం పెరిగింది. కాగ్ ఖరారు చేసిన గణాంకాల ప్రకారం 2014 మార్చి 31నాటికి కేంద్ర ప్రభుత్వ విదేశీ, స్వదేశీ అప్పు మొత్తం రు.50,68,235 కోట్లు. వర్తమాన సంవత్సర బడ్జెట్ ప్రతిపాదనల్లో అప్పుల గురించి నిర్మలమ్మ పార్లమెంటుకు సమర్పించిన నివేదిక ప్రకారం, 2023 మార్చి నెలాఖరుకు రు.152,61,122.12 కోట్లుగా కాగా, 2024 మార్చి ఆఖరుకు రు.169,46,466.85 కోట్లకు చేరుతుందని పేర్కొంది. ఎన్నికల సంవత్సరం గనుక ఇంకా పెరగటమే తప్ప తగ్గే అవకాశంలేదు. దీనిలో స్వదేశీ అప్పు రు.147,77,724.43 కోట్ల నుంచి రు.164, 23,983.04కు, విదేశీ రుణం రు.4,83,397.69 నుంచి రు.5,22,683.81 కోట్లకు పెరుగుతుందని తెలిపారు. ఇంత అప్పుచేసినా మానవాభివృద్ధి సూచికలు దిగజారాయంటే ఆ సొమ్మును జనానికి గాకుండా కార్పొరేట్లకే కట్టపెట్టారన్నది స్పష్టం. పెంచిన పన్ను భారాలు, అప్పుల గురించి అడిగితే జాతీయ రహదారులు, రైల్వేలను అభివృద్ధి చేశామంటారు. నిజమే, వాటిని వినియోగించుకున్నవారి నుంచి వసూలుచేస్తున్న టోలుటాక్సు ఎంత ? సామాన్యులు ఎక్కే పాసింజరు రైళ్లను రద్దుచేసి వాటిని ఎక్స్‌ప్రెస్‌ల పేరుతో జనాన్ని బాదుతున్నారు. వృద్ధులకు ఇచ్చే రాయితీలను రద్దు చేశారు. రిజర్వేషన్ల రద్దుకు ఎంత వసూలు కోతపెడుతున్నారో తెలిసిందే. స్టాటిస్టా సంస్థ వెల్లడించిన సమాచారం ప్రకారం, 2017 ఆర్థిక సంవత్సరం నుంచి 2023 వరకు టోల్‌టాక్సు రు.17,942 కోట్ల నుంచి 48,028 కోట్లకు పెరిగింది. దీనిలో సరకు, ప్రయాణీకుల రవాణా వాహనాల నుంచి వసూలు చేసేదే ఎక్కువ అన్నది తెలిసిందే, అంటే ఆ మేరకు జనం మీద భారం మోపుతున్నారు.

లడాక్‌లో బీజేపీకి ఓటమి షాక్

సుశీల్ కుట్టి

జమ్ము-కశ్మీర్‌లోని లడాక్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్-కార్గిల్‌కు జరిగిన ఎన్నికల్లో బీజేపీకి ఓటర్లు తీవ్ర షాక్ ఇచ్చారు. 370 అధికరణను రద్దు చేయడం ద్వారా కశ్మీర్‌లో రెండు కేంద్ర పాలిత ప్రాంతాలను ఏర్పాటు చేశారు. ఈ అధికరణ రద్దు వెనుకు బీజేపీకి రహస్య ఎజండా ఉన్నదనేది బహిరంగ రహస్యమే. కశ్మీర్‌కు ఉన్న స్వయంప్రతిపత్తిని రద్దుచేశారు. కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని అంతం చేస్తామని అందుకే తాము 370 అధికరణను రద్దు చేసామని బీజేపీ ప్రభుత్వం డప్పాలు కొట్టుకున్నది. ఆ రాష్ట్రాన్ని ఎలాగైనా బీజేపీ అధీనంలోకి తెచ్చుకోవాలన్నదే నరేంద్ర మోదీ సర్కార్ ఆలోచన. అయితే, మోదీ అమిత్‌షాలు పన్నిన వ్యూహం ఏమాత్రం ఫలించలేదు. ఉగ్రవాదం తగ్గలేదని అక్కడ జరుగుతున్న ఘర్షణాత్మక సంఘటనలు తెలియజేస్తున్నాయి. లడక్‌లో మొట్టమొదటిసారి జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్‌ల కూటమి దిగ్విజయం సాధించింది. అదే సమయంలో బీజేపీ అత్యంత అవమానకరంగా ఓటమి చెందింది. నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ నాయకుడు ఒమర్ అబ్దుల్లా, కాంగ్రెస్ నాయకులు ఇక్కడ విజయంతో ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. లడక్ కౌన్సిల్‌లో 30మంది సభ్యులు ఉన్నారు. అక్టోబరు 4వతేదీన 26సీట్లకు ఎన్నికలు జరిగాయి. నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్‌ల కూటమి 21సీట్లు గెలుచుకున్నాయి. బీజేపీ కేవలం రెండుసీట్లు మాత్రమే గెలుచుకుని ప్రథమస్థాయిలోఉంది. కశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమి చాలా బలంగాఉందని ఈ ఎన్నికలు నిరూపించాయి. ఇక్కడ ప్రజల ఆమోదం లేకుండానే కశ్మీర్ స్వయంప్రతిపత్తిని రద్దుచేసి రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడగొట్టారని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రజల ఆమోదం లేకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని జమ్ము-కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే 370 అధికరణను బీజేపీ ప్రభుత్వం రద్దుచేసింది.

కాంగ్రెస్‌తో కలిసి కూటమిని ఏర్పాటుచేసి ఈ ఎన్నికల్లో దిగ్విజయం సాధించామని, తమ కూటమి బలంగాఉందని నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్‌అబ్దుల్లా ప్రకటించారు. ఈ ఎన్నికల ఫలితాన్ని కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా, ప్రధాని మోదీ ఒక గుణపాఠంగా తీసుకోవాలని ఒమర్‌అబ్దుల్లా అన్నారు. ప్రజలను విశ్వాసంలోకి తీసుకుని పరిపాలించడం ప్రజాస్వామ్యంలో ఉత్తమమైన సంప్రదాయమని అబ్దుల్లా అన్నారు. జమ్ము-కశ్మీర్‌ను విడదీసిన ఫలితాన్ని కేంద్రం అనుభవించక తప్పదని ఒమర్ అబ్దుల్లా చెప్పారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా, రాజ్యాంగానికి భిన్నంగా జమ్ము-కశ్మీర్‌ను విడగొట్టారని ప్రజలకు ఏమాత్రం ఈ చర్య ఆమోదనీయంగాలేదని నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు అన్నారు. అభివృద్ధి మండలికి ఎన్నికైన కౌన్సిలర్లు ఈ విజయాన్ని మరింత భారీ విజయానికి తీసుకువెళ్లాలని రాష్ట్రస్థాయి ఎన్నికల్లోనూ గెలుపొంది తీరాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ఎలాంటి ఊగిసలాటలేకుండా తోడ్పాటు అందించిందని ఆయన అన్నారు. బీజేపీ నాయకులు, ఓడిపోయిన అభ్యర్థులు రాజ్‌భవన్‌లో దాక్కుని ఉన్నారని ఒమర్ అబ్దుల్లా వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. పాలకులు ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని ఆయన సూచించారు. అభివృద్ధి మండలి ఎన్నికల్లో 77శాతం ఓటర్లు పాల్గొన్నారు. ఈ ఎన్నికల నుండి మెహబూబా ముక్తి నాయకత్వంలోని పీపుల్స్‌డెమొక్రటిక్ పార్టీ దూరంగా ఉన్నది. నేషనల్‌కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమి కలిసి పోటీచేసినప్పటికీ దాదాపు ఒక డజను సీట్లలో స్నేహపూర్వక పోటీ కూడా జరిగాయి. ఆమ్ ఆద్మీ పార్టీ నాలుగు సీట్లకు పోటీ చేసినప్పటికీ అన్నింటిలోనూ ఓటమిపాలైంది. ఇటీవల రాహుల్‌గాంధీ కార్గిల్, లడక్‌ప్రాంతాల్లో పర్యటించినప్పుడు ఆయనపైన తీవ్ర విమర్శలు వచ్చాయి. బీజేపీ దాదాపు తుడిచిపెట్టుకుపోయినట్లుగా ఓటమి పాలైనప్పటికీ జాతీయమీడియా కావాలనే ఈ వార్తను అందించలేదు. భవిష్యత్తులో లోకసభకు జరగనున్న ఎన్నికల ఫలితాలకు ఈ గెలుపు సంకేతమవుతుందా?

అధమస్థాయిలో అమెరికా రాజకీయ వ్యవస్థ

బి. లలితానంద ప్రసాద్(రిటైర్డ్ ప్రొఫెసర్)

ప్రస్తుతం అమెరికన్లు ఎవరి గురించి ఏమనుకుంటున్నారో తెలియడానికి ఎలాంటి పోలింగ్ అవసరం లేదు. రాజకీయ వ్యవస్థ పట్ల ప్రజాభిప్రాయం అత్యంత అధమ స్థాయికి చేరింది. ఇదే విషయాన్ని 'ప్యూ' రీసెర్చ్ సెంటర్ సర్వే రుజువు పరిచింది. అక్కడ కేవలం 10 శాతం మాత్రమే ప్రస్తుత వ్యవస్థపై ఆశాజనకంగా ఉన్నారు. ఆసక్తిదాయకంగా ఉన్న వారు నాలుగు శాతం మాత్రమే. 55 శాతం ప్రస్తుత పాలనపై ఆగ్రహంగా ఉన్నారు. 65 శాతం పూర్తి నిరాశాజనకంగా ఉన్నారు. ఈ సర్వే మొదటిది కాదు, చివరిది కాదు. అమెరికన్లు పరిష్కారరహిత పాక్షిక ఘర్షణలతో విసుగెత్తి ఉన్నారు. ప్రవాసులకు సంబంధించిన ఇమిగ్రేషన్ సమస్య దశాబ్దాలుగా పేరుకుని ఉంది. ఎడతెగక నానుతూనే ఉంది. ఇంకో పక్క సుప్రీంకోర్టు అబార్షన్ అంశం తెరపైకి తెచ్చింది. ఒక విధంగా బైడెన్ వీటిని పరిష్కరించగలనని ఎన్నికలలో గెలిచాడు. 'ప్యూ' ప్రకారం 60 శాతం అమెరికన్లు డెమొక్రట్లకు సానుకూలంగా లేరు. 61శాతం రిపబ్లికన్లకు అనుకూలంగా లేరు. ఇటీవల సీక్స్ పోల్ ప్రకారం స్పందించిన వారిలో 54శాతం డెమొక్రటిక్‌ల కన్నా రిపబ్లికన్లు మెరుగని, వారికి ప్రజాదరణ కలదని చెప్పగా, అదే శాతం రిపబ్లికన్ల కన్నా డెమొక్రటిక్ మెరుగని అభిప్రాయపడ్డారు. వాస్తవానికి అక్కడ మెజారిటీ శాతం మాత్రం రెండూ రెండేనని, ఎవరికి ఎవరు తీసిపోరని అభిప్రాయాన్నివ్యక్తంచేయడం విశేషం.

ఇరు పార్టీలపై అక్కడ సానుకూలత లేకుండా ఉండడం ఆశ్చర్యకరం కాదు. ఇది మూడు దశాబ్దాల క్రితం ఆరు శాతం నుండి ఇప్పటి 28 శాతానికి చేరింది. 37 శాతం మంది ఎక్కువ పార్టీలు ఉంటే మేలైనపార్టీని ఎంచుకోవచ్చని అంటున్నారు. ఈ నేపథ్యంలో మరో పార్టీకి లేక స్వతంత్రులకు అవకాశాలు ఈ రెండు పార్టీలు ఎంతవరకు ఇవ్వగలవు అనేది ప్రశ్నార్థకం. కానీ ఓటర్లు మాత్రం మూడో ప్రత్యామ్నయం ప్రభావం రాజకీయ వ్యక్తుల స్థితిగతులను మెరుగు పరచడానికి దోహద పడగలవని భావిస్తున్నారు. అయితే అక్కడ మూడింట రెండు వంతుల మంది రానున్న 25 సంవత్సరాల్లో స్వతంత్ర అభ్యర్థులు నెగ్గలేరని అంటున్నారు. కేవలం 26 శాతం మంది దేశీయ సమస్యల పరిష్కారాలకు ఎక్కువ పార్టీలతో సులభ సాధ్యం అంటున్నారు. అదే మోతాదులో అదనపు పార్టీలు సమస్యల్ని మరింత సంక్లిష్టం చేస్తాయనటం గమనించదగిన అంశం.

ప్రస్తుత పరిస్థితులనుబట్టి అక్కడ మరోసారి ట్రంప్, బైడెన్ మధ్య పోటీ అనివార్యమైతే అది అత్యధికులకు అసంతృప్తి దాయకం. సర్వే ప్రకారం 64శాతం రిజిస్టర్ ఓటర్లు ఈ ఎన్నిక ప్రాథమిక ప్రక్రియ 'లోపభూయిష్టంగా' భావిస్తున్నారు. వీటికి సంబంధించి బైడెన్‌కు పరిమితులు అనేకం. ఆయనకి దేశ అధ్యక్షునికి అవసరమైన మేధో సునిశితత్వం, భౌతిక ఆరోగ్య సామర్థ్యం రెండోసారి అధ్యక్షుడిగా ఉండి బాధ్యతలు నిర్వర్తించగల స్థితిలోలేవు. అక్కడ కేవలం 34 శాతం మంది మాత్రమే ఆయన రెండో టరం పూర్తి చేయగలరు అంటున్నారు. రిపబ్లికన్ల అంచనా ప్రకారం అయితే బైడెన్‌కు ఓటు అంటే 'కమల హారిస్' కి వేసినట్లు అంటున్నారు. అయితే శ్వేత సౌధానికి తిరిగి ట్రంపు రావడానికిగల పరిమితులు ప్రత్యేకమైనవి. అక్కడ సగం ప్రజలు ఆయన తిరిగి ఎన్నికైతే ఈసారి గతంలో కన్నా మరిన్ని అధ్యక్ష అధికారాలను దుర్వినియోగం చేసారని అంటున్నారు. 75 శాతం మంది అది చాలా ప్రమాదకరం అంటున్నారు. డెమొక్రటిక్ వాదన ప్రకారం ట్రంప్ ఎన్నిక నిరంకుశత్వానికి ఎంపికగా అభివర్ణిస్తున్నారు. అయితే అక్కడ జాతీయ సంస్థల పట్ల ప్రజల సమ్మతి లేక అసమ్మతి రాజకీయ పార్టీలకు అతీతంగా భిన్నంగా ఉంటుంది. కేవలం 27శాతం అమెరికన్లు రాజకీయ వ్యవస్థ బాగానే ఉంది లేదా కొంత బాగుంది అంటున్నారు. 37శాతంమంది వీటి భవిష్యత్తు పట్ల విశ్వాసం కలిగి ఉన్నారు. అయితే ఫెడరల్ గవర్నమెంట్ పట్ల నమ్మకం ఎన్నడూ లేనంతగా 16శాతానికి పడిపోయింది. అక్కడ కాంగ్రెస్ పట్ల అసమ్మతి కొత్తకాదు. కానీ అక్కడ సుప్రీంకోర్టు పట్ల 54శాతం విశ్వసనీయత సన్నగిల్లినట్లు వ్యక్త పరచటం అక్కడి ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతుంది. కొన్ని తీర్పులకు సంబంధించి చట్టబద్ధతకు చెందిన అంశాలు ఎలా ఉన్నా కొన్నిటిలో ప్రజాక్షేత్రంలోసందేహాలు రేకెత్తించటం, అపార ప్రభావం చూపటం గమనార్హం.

ఇప్పుడు అక్కడ నూతన ప్రారంభం కావాలి. అక్కడి ఉభయ పార్టీలు తమను తాము పునరుజ్జీవింప చేసుకోవాలి. దీనికి బదులు అక్కడి రాజకీయాలు మరింతగా ఘనీభవించిన దాఖలాలు ఉంటున్నాయి. ట్రంప్ వరుసగా మరోసారి తన పార్టీ ద్వారా ఎంపికకు సన్నద్ధమవుతున్నారు. బైడెన్ తన ప్రయత్నాలు 50 సంవత్సరాల క్రితం ప్రారంభించినప్పటికీ తొలి పరుగు 1988లో మొదలైంది.

ఫోన్: 9247499715

కాషాయపార్టీలో టికెట్ల లొల్లి

- షెకావత్ అల్లుడి తిరుగుబాటు
- టికెట్ నిరాకరించటంతో నిరసనలు

జైపూర్: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాజస్థాన్‌లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నుంచి అధికారాన్ని చేజిక్కించుకోవాలని బీజేపీ 41 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. అయితే, బీజేపీలో టికెట్లు దక్కని వారు తమదైన రీతిలో ఆందోళనలు, నిరసనలను చేస్తున్నారు. ఇందులోనూ రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే సింధియా వర్గీయులే అధికంగా ఉండటం గమనార్హం. భైరాన్‌సింగ్ షెకావత్ అల్లుడు సైతం రాజేకు సన్నిహితుడే. ఇక జోత్వారా అభ్యర్థిగా తొలగించిన తర్వాత వసుంధర రాజేను రాజ్‌పాల్‌సింగ్ షెకావత్ కూడా కలిశాడు. ఆయనే కాదు రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనితా గుర్జార్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు. తాను రాజేకు సన్నిహితురాలినైనందుకే తన పట్ల పార్టీ ఈ విధంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. అయితే, ఈ పరిణామాలన్నీ బీజేపీకి రాబోయే ఎన్నికల్లో ప్రతి కూల ఫలితాలను తీసుకు వస్తాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాజస్థాన్‌లో బీజేపీకి కొత్త తలనొప్పి ఎదురైంది. ఆ పార్టీ ఇప్పటికే తన మొదటి అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. అదే ఇప్పుడు ఆ పార్టీలో నిరసనలు, అసమ్మతికి కారణమవుతున్నది. దాదాపు 12 నియోజకవర్గాలలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. టికెట్ దక్కని వారు తమదైన రీతిలో ఆందోళనలు చేస్తున్నారు. బీజేపీ తొలి జాబితాలో 41 స్థానాలకు అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించిన విషయం విదితమే. ఇక అభ్యర్థుల ఎంపిక గందరగోళానికి దారి తీసిన స్థానాల్లో ప్రముఖమైనవి విద్యాధర్ నగర్, ఝోత్వా రా, కిషన్‌గఢ్, నగర్, టోంక్, సంచోర్, కోట్‌పుట్లీ ఉన్నాయి. మొత్తం మీద పార్టీ తొలి జాబితాలో ఏడుగురు ఎంపీలను చేర్చుకున్నది. తిరుగుబాటు నేతలను సముదాయించి పార్టీ అభ్యర్థులపై పోటీ చేయకుండా నిరోధించేందుకు బార్మర్ ఎంపీ, కేంద్ర మంత్రి కైలాశ్ చౌదరి ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేసినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. మాజీ ఉపరాష్ట్రపతి భైరాన్‌సింగ్ షెకావత్ అల్లుడు నర్పత్ సింగ్ రాజ్వీ కూడా అసమ్మతితో తిరుగుబాటు బావుట ఎగురవేసిన వారిలో ఉన్నారు. విద్యాధర్ నియోజకవర్గం నుంచి ఆయన మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే, ఈసారి పార్టీ ఆయనకు టికెట్ నిరాకరించింది. ఈ నియోజకవర్గంలో ఆయన స్థానంలో ఎంపీ దియా కుమారికి అవకాశం కల్పించింది. ఇది నర్పత్ సింగ్‌కు ఆగ్రహాన్ని తెప్పించింది. పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటా ఎగురవేశారు."భైరాన్ సింగ్ షెకావత్ వారసత్వాన్ని కించపరిచే వ్యూహం ఇది. నేను ఇక్కడి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ పార్టీ అభ్యర్థిని మార్చడం దిగ్భ్రాంతికరం. నేను బాధపడ్డాను. రాబోయే రోజుల్లో నా భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయిస్తాను" అని విద్యాధర్ నగర్ ఎమ్మెల్యే అన్నారు.

కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు గుజరాత్ హైకోర్టులో ఊరట లభించలేదు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ డిగ్రీపై గుజరాత్ యూనివర్సిటీ దాఖలు చేసిన నేరపూరిత పరువునష్టం దావా కేసులో ఆప్ నేతలు కేజ్రీవాల్, సంజయ్‌సింగ్‌కు మేజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన సమన్లపై స్టే ఇవ్వడానికి గుజరాత్ హైకోర్టు గురువారం నిరాకరించింది. విచారణ కోర్టు ఇచ్చిన సమన్లు కొట్టివేయాలని ఆప్ నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ చేపట్టిన జస్టిస్ జేసీ దోషి...గుజరాత్ యూనివర్సిటీ, రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేశారు. కేసు తదుపరి విచారణను నవంబరు 3వ తేదీకి వాయిదా వేశారు. ఆ రోజు పూర్తిస్థాయి విచారణ జరుపుతానని జస్టిస్ దోషి చెప్పారు. పరువునష్టం కేసు విచారణను అహ్మదాబాద్‌లోని మేజిస్ట్రేట్ కోర్టు అక్టోబరు 14వ తేదీన చేపట్టనున్నదన, అందువల్ల కేజ్రీవాల్, సంజయ్‌సింగ్‌కు తాత్కాలిక ఉపశమనం కల్పించాలని వారి తరపు న్యాయవాది రెబక జాన్ హైకోర్టుకు విన్నవించారు. 'ఈ కేసు విచారణ ఎల్లుండి(అక్టోబరు 14)న మేజిస్ట్రేట్ కోర్టు ముందు విచారణకు వస్తుంది. ఈ విచారణ జరపకుండా స్టే విధించండి. మీరు తాత్కాలిక రక్షణకు అనుమతించకపోతే ఇప్పుడు చేపట్టిన మొత్తం విచారణ ప్రక్రియ నిష్ఫలమవుతుంది' అని రెబక జాన్ హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో తానేమీ ఉపశమనం కల్పించలేనని, అలా చేసే హక్కు లేదని, సాధ్యమైనంత త్వరగా కేసు విచారణ చేపడదామని, కానీ నేడు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేనని జస్టిస్ దోషి స్పష్టంచేశారు.

సరికొత్త శిఖరాలకు వ్యూహాత్మక భాగస్వామ్యం

ఫ్రాన్స్ మంత్రితో రాజ్‌నాథ్‌సింగ్ చర్చలు

న్యూఢిల్లీ: భారత్, ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యం సరికొత్త శిఖరాలకు చేరుకుంటుందని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. సైబర్ స్పేస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కీలక అంశాలలో సహకారంపై భారత్, ఫ్రాన్స్ చర్చలు జరిపినట్లు ఆయన తెలిపారు. భారత్, ఫ్రాన్స్ రక్షణ చర్చలపై బుధవారం పారిస్‌లో రాజ్‌నాథ్‌సింగ్, ఫ్రాన్స్ రక్షణమంత్రి సెబాస్టియన్ లెకోర్ను మధ్య మంతనాలు జరిగాయి. ప్రత్యేకించి రక్షణ పరిశ్రమ సహకారంపై ఇద్దరు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ప్రాంతీయ పరిస్థితుల నుంచి సైన్యం-సైన్యం కార్యకలాపాల వరకు ఇద్దరు మంత్రులు చర్చించారని రక్షణమంత్రిత్వశాఖ గురువారం తెలిపింది. లెకోర్నుతో తన సమావేశం అద్భుతమని అభివర్ణిస్తూ రాజ్‌నాథ్‌సింగ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. భారత్, ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యం చాలా ఏళ్లుగా కొనసాగుతోందని, ఇంతకుముందు కన్నా ఇప్పుడు మరింత బలోపేతమవుతోందని, ఈ భాగస్వామ్యాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లాలని తాము కోరుకుంటున్నట్లు రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. ప్రస్తుతం కొనసాగుతున్న రక్షణకు సంబంధించిన ప్రాజెక్టులపై సింగ్, లెకోర్ను సమీక్షించారని, రెండు దేశాల రక్షణ పరిశ్రమల మధ్య సహకారాన్ని మరింత పటిష్టవంతం చేయడానికి అనుసరించాల్సిన మార్గాలపై చర్చించారని రక్షణమంత్రిత్వశాఖ వివరించింది. అంతరిక్షం, సైబర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పైనా చర్చించినట్లు తెలిపింది.



గంగా జలంపై జీఎస్టీ

విమర్శలతో వెనక్కు తగ్గిన కేంద్రం

న్యూఢిల్లీ: దేశాభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన కేంద్రంలోని బీజేపీ అడ్డగోలు పన్నులతో సామాన్యుల ఉసురుతీస్తున్నది. 2017లో అమల్లోకి తీసుకొచ్చిన వస్తుసేవల పన్ను (జీఎస్టీ) పేరిట సామాన్యుల నుంచి ముక్కు పిండి మరీ పన్నులు వసూలు చేస్తున్నది. ఈ ప్రహసనంలో హిందువులు పరమ పావనిగా, సకల పాప హరణిగా కొలిచే 'గంగా జలం'పై కూడా 18 శాతం జీఎస్టీ విధిస్తున్నట్టు ఇటీవల ఓ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. అయితే, అన్ని వర్గాల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంటున్నట్టు కేంద్రం గురువారం రాత్రి పొద్దుపోయిన తరువాత కేంద్రం ప్రకటించింది. జీఎస్టీ విధించాలన్న కేంద్రం నిర్ణయంపై సామాన్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పండుగల సీజన్ ప్రారంభమవుతున్న సమయంలో పూజా కార్యక్రమాల్లో వినియోగించే గంగా జలంపై పన్నును విధించడమేంటని నిలదీస్తున్నారు. ప్రజలను దోచుకోవడానికే కేంద్రం జీఎస్టీ పేరిట వసూళ్లకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనితో కేంద్రం దిగిరాక తప్పలేదు.

కోట్ల మంది పేదలు, మధ్యతరగతి జీవులకు ప్రధాన ఆహారమైన గోధుమ పిండి, పాల ఉత్పత్తులు, ప్రీప్యాక్డ్, ప్రీలేబుల్డ్ ఆహార ధాన్యాలు, చేపలు, పన్నీర్, తేనె, ఫ్రీజ్ చేయని మాంసం, చెక్కర, టీ పొడి ఇలా దాదాపు అన్ని ప్యాకేజ్డ్ ఫుడ్స్‌పై 5% జీఎస్టీ విధించిన కేంద్రం.. పసిపిల్లలకు వాడే పాల పొడిపైనా జీఎస్టీని విధించింది. రోగమొచ్చి దవాఖానకు వెళ్లినా 5% పన్ను, విద్యార్థులు వాడే పెన్సిళ్లు, షార్ప్‌నర్లు, ప్యాకేజ్డ్ బట్టర్, నెయ్యి, పండ్లరసాలు, హోటల్‌కు వెళ్లి తిందామంటే 12%, ఆరోగ్య బీమా చెల్లింపులపై 18% పన్నువాత పెట్టింది. 2017 నుంచి కిందటేడాది నవంబర్ వరకు జీఎస్టీ చట్టంలో కేంద్రం ఏకంగా 907 సవరణలు చేసింది.

నీళ్లు లేవు...కరెంటు లేదు

- ఎన్నికలు బహిష్కరిస్తున్నాం
- చత్తీస్‌గఢ్ గిరిజనుల స్పష్టీకరణ

కోర్బా(చత్తీస్‌గఢ్): ఎన్నికల వేళ తమ డిమాండ్లు పరిష్కరించుకునేందుకు ప్రజలు సమాయత్తమవుతున్నారు. తమ ప్రాంతాలకు మౌలిక వసతులు కల్పించాలని ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో ఓటు అస్త్రాన్ని ప్రయోగించాలని ప్రజలు భావిసున్నారు. త్వరలో చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో కోర్బా జిల్లాలోని రెండు గ్రామాల గిరిజనులు ఓటును ఆయుధంగా చేసుకొని...డిమాండ్ల సాధనకు నడుంబిగించారు. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతంలో ఇప్పటికీ తమకు తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి కనీస వసతులు లేవని చత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లాలో గల రెండు గిరిజన గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా హామీలు ఇవ్వడమే తప్ప ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలని ఆ రెండు గ్రామాల ప్రజలు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని రాంపూర్ అసెంబ్లీ నియోజకవర్గం లోని సర్డీ, బాగ్దారీదండ్ గ్రామాల్లో అత్యంత వెనుకబడిన గిరిజనులు జీవిస్తారు. వారిని రాష్ట్రపతి దత్తపుత్రులని కూడా పిలుస్తారు. బీజేపీ ఎమ్మెల్యే నంకీ రామ్ కన్వర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గానికి రెండో విడతలో నవంబరు 17న ఎన్నికలు జరుగుతాయి. మొదటిదశ ఎన్నికలు నవంబరు 7న నిర్వహి స్తారు. ఓటింగ్‌ను బహిష్కరిస్తున్నట్లు గిరిజనులు రెండు గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామ శివారులో ఇదే సందేశంతో కూడిన బ్యానర్ ఏర్పాటు చేశారు. 'తాగునీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, మొబైల్ టవర్లు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని మేము సుదీర్ఘ కాలంగా డిమాండ్ చేస్తున్నాం. అయినా ప్రజా ప్రతినిధులు మా డిమాండ్లను కనీసం పట్టించుకోలేదు' అని పహదీ కోర్వా వర్గానికి చెందిన సర్డీ గ్రామవాసి సంతోశ్ చెప్పారు. సర్డీ, బాగ్దారీదండ్, ఖురిభౌనాలకు చెందిన పహదీ కోర్వాస్ గిరిజన తెగలు తాగునీటి కోసం ఏళ్లతరబడి ఇబ్బందులు పడుతున్నారని, అటవీ ప్రాంతంలో గుంతలు తవ్వుకొని తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తున్నదని ఆరోపించాడు. తమ గ్రామాలకు రోడ్లు లేవని చెప్పాడు. 'శుష్క వాగ్దానాలతో ఎంతోకాలం రాజకీయ నాయకులు మనజాలరు. ఈసారి ఓటింగ్ బహిష్కరించాలని గ్రామస్థులంతా నిర్ణయించుకున్నారు. ఇంతకుమించిన మార్గం మరొకటి కనిపించలేదు' అని సంతోశ్, కొంతమంది మహిళలు విలేకరులకు చెప్పారు. కోర్బా నగరానికి 20 కిలో మీటర్ల దూరంలో అటవీప్రాంతంలో గల కెరాకచ్చర్ గ్రామంలో 150 పహదీ కోర్వా కుటుంబాలు జీవిస్తున్నాయి. ఈ గ్రామస్థులు సైతం ఏనుగుల బెడదను ఎదుర్కొం టున్నారు. 'మా గ్రామాలకు విద్యుత్ లేదు. అందుకే సర్డీ, బాగ్దారిదండ్ గ్రామవాసులు ఎన్నికలను బహిష్కరించారు' అని రాసిన బ్యానర్లు గ్రామ శివారులో ఏర్పాటు చేశారు. దీనిపై కోర్బా జిల్లా పంచాయతీ అధికారి విశ్వదీప్‌ను ప్రశ్నించగా ఎన్నికల బహిష్కరణకు సంబంధించిన సమాచారం తమకు అందిందని, గిరిజనులు లేవనెత్తిన సమస్యలు తెలుసుకోవడానికి ఇతర అధికారులతో కలిసి తాను ఆ గ్రామాలకు వెళతానని చెప్పారు. ఎన్నికల బహిష్కరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని...ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని గ్రామస్థులను కోరతామన్నారు. ఐఏఎస్ అధికారి అయిన విశ్వదీప్ జిల్లా ఓటర్ల చైతన్య కార్యక్రమానికి నోడల్ అధికారిగా పనిచేస్తున్నారు.

సొంతింటిలో మినీ బార్లకు చెక్

డెహ్రాడూన్: మద్యం విధానంలోని కొన్ని నిబంధనలను ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఇంటిలోనే వ్యక్తిగత మినీ బార్లు ఏర్పాటు చేసుకోవచ్చన్న నిబంధనను వెనక్కి తీసుకుంది. ఇంటిలోనే మినీ బార్లు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతిస్తూ మద్యం విధానంలో రూపొందించిన 11, 13 నిబంధనలను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఉపసంహరించుకుంటున్నట్లు ఎక్సైజ్ కమిషనర్ వెల్లడించారు. ఆదాయపన్ను చెల్లించే ఎవరైనా ఏడాదికి రూ.12 వేలు చెల్లించి సొంత ఇంటిలోనే మినీ బార్లు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతిస్తూ 2023-24 మద్యం విధానంలో ప్రభుత్వం నిబంధనలు పెట్టింది. ఈ లైసెన్సు పొందిన వారు వ్యక్తిగత వినియోగానికిగాను 9 లీటర్ల ఇండియన్ మేడ్ ఫారెన్ లిక్కర్, 18 లీటర్ల ఫారెన్ ఆల్కహాల్, 9 లీటర్ల వైన్, 15.6 లీటర్ల బీరు ఇంటిలో ఉంచుకోవచ్చని, దీనిని విక్రయించడం కుదరదని ప్రభుత్వం తెలిపింది. లైసెన్సుదారులు డ్రైడే నాడు మినీబార్లు మూసివేయాలని నిబంధన పెట్టింది.

కాంట్రాక్టు ఉద్యోగినికీ ప్రసూతి సెలవులు ఇవ్వాల్సిందే

స్పష్టం చేసిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: కాంట్రాక్టు ఉద్యోగినికీ ప్రసూతి సెలవులు ఇవ్వాల్సిందేనని ఢిల్లీ హైకోర్టు స్పష్టంచేసింది. ప్రసూతి సెలవులను నిరాకరించడం అమానవీయమని పేర్కొంది. కాంట్రాక్టు ఉద్యోగం అనే సాకు చెప్పి సెలవులను నిరాకరించడం ఆమె ప్రాథమిక హక్కులను కాలరాయడమేనని తెలిపింది. ఢిల్లీ యూనివర్సిటీలో కాంట్రాక్టు పద్ధతిలో సహాయకురాలిగా పని చేస్తున్న ఒక ఉద్యోగిని ప్రసూతి సెలవులు తీసుకోగా ఆమెను యూనివర్సిటీ సర్వీస్ నుంచి తొలగించింది. దీనిపై ఆమె ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ చంద్రధరి సింగ్ విచారణ చేపట్టారు. కాంట్రాక్టు ఉద్యోగం అయినంత మాత్రాన నోటీసులు లేకుండా ఉద్యోగం నుంచి తొలగించడం చట్టవిరుద్ధమ ని హైకోర్టు పేర్కొంది. వెంటనే ఆమెను సర్వీసులోకి తీసుకొని, నష్టపరిహారంగా రూ.50 వేలు చెల్లించాలని ధర్మాసనం యూనివర్సిటీని ఆదేశించింది.

కులగణనతోనే న్యాయం

ప్రియాంకగాంధీ

మాండ్ల(ఎంపీ): ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేయడానికి కులగణన చేయాల్సిందేనని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా డిమాండ్ చేశారు. బీజేపీ 18 ఏళ్ల పాలనలో మధ్యప్రదేశ్‌లో 250 కుంభకోణాలు చోటుచేసుకున్నాయని విమర్శించారు. 'బీహార్‌లో ఇటీవల కులగణనను విజయవంతంగా పూర్తి చేశారు. దీని ప్రకారం రాష్ట్రంలో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల జనాభా 84 శాతం మంది ఉన్నారు. కానీ ఉద్యోగాలలో వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. అణగారిన వర్గాల ప్రజల కచ్చితమైన సంఖ్య తెలిస్తే...వారికి న్యాయం చేయడానికి వీలుంటుంది. అందుకే దేశవ్యాప్తంగా కులగణన చేయాల్సిందే'నని ప్రియాంక డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో మాండ్లా జిల్లాలో ప్రియాంక గురువారం ఓ బహిరంగ సభలో ప్రసంగించారు. పాత పెన్షన్ పథకం(ఓపీఎస్) అమలుతో పాటు అనేక హామీలను ప్రియాంక గుప్పించారు. మధ్యప్రదేశ్‌లో తమ పార్టీ అధికారంలోకి వస్తే ఒకటి నుంచి ఇంటర్ వరకు ఉచిత విద్య అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. అలాగే ఒకటి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు నెలకు రూ.500, 9, 10 తరగతుల విద్యార్థులకు రూ.1000, ఇంటర్ విద్యార్థులకు రూ.1500 సాయమందిస్తామని వివరించారు. 18 ఏళ్ల తన పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో హామీలు గుప్పించడం మినహా అమలు చేసిన చరిత్ర బీజేపీకి లేదని ఆరోపించారు. 225 నెలల బీజేపీ పాలనలో వ్యాపం, మధ్యాహ్న భోజనం, స్కాలర్‌షిప్ సహా 250 కుంభకోణాలు జరిగాయని గుర్తుచేశారు. తన నాయనమ్మ ఇందిరాగాంధీని గుర్తు చేస్తూ ప్రజలు ప్రత్యేకించి గిరిజనుల పట్ల ఇందిరమ్మ బాధ్యతాయుతంగా ఉన్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ పార్టీ హామీలన్నింటినీ అమలు చేసి తీరుతుందని ప్రియాంక చెప్పారు.

జీవనశైలి మారితేనే వాతావరణ మార్పులను ఎదుర్కోగలం

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

న్యూఢిల్లీ: వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి కేవలం విధానాలు, చట్టాలను రూపొందిస్తే సరిపోదని... మన జీవనశైలిని మార్చుకోవడం ద్వారా సమష్టి సహకారం అవసరమని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అభిప్రాయపడ్డారు. గురువారం ఇక్కడ 'జీవనం: వాతావరణం కోసం జీవనశైలి' అనే అంశంపై జరిగిన పార్లమెంటరీ సదస్సులో ప్రసంగిస్తూ... జీ20, ఇతర ఆహ్వానిత దేశాల పార్లమెంటేరియన్లు జీవనశైలిపై ఆయా దేశాల చట్టసభల్లో చర్చించాలని కోరారు. మెరుగైన ప్రపంచాన్ని సృష్టించేందుకు ఇది సామూహిక ఉద్యమంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. 'పర్యావరణానికి అనుగుణ్యమైన జీవనశైలిపై భారత పార్లమెంటులో విస్తృత చర్చలు జరిగాయి. చట్టాలు చేయబడ్డాయి. 'కానీ వాతావరణ మార్పుల సమస్యపై విధానాలు, చట్టాలను రూపొందించడం మాత్రమే సరిపోదు. మన దినచర్యను మార్చుకోవడం ద్వారా మనమందరం సమష్టిగా సహకరించాలి' అని బిర్లా పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పర్యావరణం కోసం జీవనశైలి అనే ఆలోచనను ప్రపంచానికి అందించారని ఆయన గుర్తు చేశారు. పర్యావరణానికి హాని కలిగించని జీవన విధానాన్ని అవలంబించాల్సిన అవసరం ఉందని, ఇది మనందరి వ్యక్తిగత, సమష్టి బాధ్యతని ఆయన అన్నారు. తొమ్మిదో జీ20 పార్లమెంటరీ స్పీకర్ల సదస్సు (పీ20) అక్టోబర్ 13 నుంచి 14 వరకు ఢిల్లీలో జరగనుంది.

ఈడీ సమన్లు చెల్లవు: సోరెన్

రాంచీ: మనీలాండరింగ్ ఆరోపణల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనకు జారీ చేసిన సమన్లు అసమంజసమైనవని, చెల్లుబాటు కావని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ బుధవారం జార్ఖండ్ హైకోర్టుకు కౌంటర్ దాఖలు చేశారు. సోరెన్‌ను సాక్షిగా పిలిచారా లేక నిందితుడిగా పిలిచారా అనేది అస్పష్టంగా ఉందని ఆయన తరపు న్యాయవాది పీ చిదంబరం... ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజయ కుమార్ మిశ్రా, జస్టిస్ ఆనందసేన్ ధర్మాసనానికి తెలిపారు. చిదంబరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వాదనలు వినిపించారు. అక్టోబర్ 13 న కేసు మళ్లీ విచారణకు రానుంది. రాంచీలోని ఫెడరల్ ఏజెన్సీ కార్యాలయంలో హాజరై వాంగ్మూలం ఇవ్వాలని సోరెన్‌కు ఆగస్టు 14న ఈడీ సమన్లు పంపింది. సమన్లకు వ్యతిరేకంగా తాను చేసిన పిటిషన్‌ను స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అయితే ఈ విషయంలో ఉపశమనం కోసం జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించే స్వేచ్ఛను సెప్టెంబర్ 18న జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేల ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం ముఖ్యమంత్రికి ఇచ్చింది. దీంతో సోరెన్ హైకోర్టును ఆశ్రయించారు. ఈడీ సమన్లను సవాలు చేస్తూ సెప్టెంబర్ 23న దాఖలు చేసిన పిటిషన్‌లోని లోపాలను సవరించాలని అక్టోబర్ 6న సోరెన్ తరపు న్యాయవాదిని హైకోర్టు ఆదేశించింది. కాగా ఈడీ తనకు జారీ చేసిన సమన్లపై స్టే విధించాలని సోరెన్ తన పిటిషన్‌లో హైకోర్టును కోరారు. తనకు సమన్లు పంపిన దర్యాప్తు సంస్థ అధికార పరిధిని కూడా ఆయన ప్రశ్నించారు. రాజకీయ కక్ష సాధింపులో భాగమే ఈడీ వేధింపులని ఆరోపించారు.

కలకత్తా హైకోర్టుకు జస్టిస్ మురళీధరన్

సుప్రీం కోర్టు పునరుద్ఘాటన

న్యూఢిల్లీ: మణిపూర్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.వి.మురళీధరన్‌ను మెరుగైన న్యాయ నిర్వహణ కోసం కలకత్తా హైకోర్టుకు బదిలీ చేయాలనే సిఫార్సును ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు కొలీజియం బుధవారం పునరుద్ఘాటించింది. మురళీధరన్‌ను తన మాతృ మద్రాసు హైకోర్టుకు మార్చమని లేదా బదిలీ చేయవద్దన్న ఆయన అభ్యర్థనను తిరస్కరించింది. షెడ్యూల్డ్ తెగ హోదాను కోరుతూ మైతేయి సంస్థ చేసిన ప్రాతినిధ్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలని జస్టిస్ మురళీధరన్ ధర్మాసనం మార్చి 27న మణిపూర్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇది లోయలో నివసిస్తున్న మైతేయిలు, మరోవైపు కొండలో నివసిస్తున్న కుకీ, ఇతర గిరిజనులకు మధ్య రాష్ట్రంలో విపరీతమైన జాతి సంఘర్షణకు దారి తీసింది. మెజారిటీ మైతేయి వర్గం ఎస్టీ హోదా కోసం ప్రాతినిధ్యాన్ని పరిగణనలోకి తీసుకుని, నాలుగు వారాల్లోగా కేంద్రానికి లేఖ రాయాలని జస్టిస్ మురళీధరన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. న్యాయమూర్తులు సంజయ్ కిషన్ కౌల్, సంజీవ్ ఖన్నా, బి.ఆర్.గవాయ్, సూర్యకాంత్‌తో కూడిన కొలీజియం, జస్టిస్ మురళీధరన్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేయాలని లేదా కలకత్తాకు బదిలీ చేయడానికి బదులుగా మణిపూర్ హైకోర్టులో పని చేయడానికి అనుమతించాలని చేసిన అభ్యర్థనను తిరస్కరించింది. అయితే, మెరుగైన నిర్వహణ కోసం మణిపూర్ జడ్జిగా ఉన్న జస్టిస్ ఎం.వి.మురళీధరన్‌ను కలకత్తా హైకోర్టుకు బదిలీ చేయాలని అక్టోబరు 9న కొలీజియం సిఫార్సు చేసింది.

జర్నలిస్టులు సహా 8 శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

రాజస్తాన్ ప్రధాన ఎన్నికల అధికారి ప్రవీణ్ గుప్తా

జైపూర్: రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో మీడియా సహా అత్యవసర సేవల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పిస్తున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. మీడియా సహా ఎనిమిది శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్‌ను అందుబాటులో తెస్తూ ఈసీ నోటిఫికేషన్ జారీ చేసింది. 'పాత్రికేయులు, విద్యుత్, రవాణా, ఆరోగ్యశాఖ సహా ఎనిమిది శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ వసతి కల్పిస్తున్నాం' అని రాజస్తాన్ ప్రధాన ఎన్నికల అధికారి ప్రవీణ్ గుప్తా తెలిపారు. మీడియా సిబ్బందిని సర్వీసు ఓటర్ల విభాగంలోకి తొలిసారి చేర్చినట్లు చెప్పారు. ఇప్పటివరకు ఈ సదుపాయం ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, అధికారులకు, ఆర్మీ, పారా మిలటరీ సిబ్బందికి మాత్రమే ఉన్నట్లు తెలిపారు. ఇకపై జర్నలిస్టులు, వైద్యులు, పారా మెడిక్స్, అంబులెన్స్ వర్కర్లు, ఇంధన శాఖలో ఎలక్ట్రీషియన్లు, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగంలో లైన్‌మెన్లు, పంప్ ఆపరేటర్లు, రాజస్తాన్ మిల్క్ కమిటీల్లో టర్నర్లు, రవాణా కార్పొరేషన్‌లో ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు, అగ్నిమాపక సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉంటుందన్నారు.

ఫిరోజ్‌పూర్‌లో 12 కిలోల హెరాయిన్ పట్టివేత

చండీగఢ్: ఫిరోజ్‌పూర్‌లో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి... వారి నుంచి 12 కిలోల హెరాయిన్ స్వాధీనం చేసుకున్నట్లు పంజాబ్ పోలీసులు తెలిపారు. నిందితులను గుర్బిందర్ సింగ్, కుల్వంత్ సింగ్‌గా గుర్తించామని... ఇద్దరూ తర్న్ తరాన్ జిల్లాలోని మల్లన్ గ్రామానికి చెందిన వారని పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. వారు ప్రయాణిస్తున్న కారును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫిరోజ్‌పూర్‌లోని ఖిల్లా చౌక్ ప్రాంతంలో పాకిస్తాన్‌కు చెందిన స్మగ్లర్లు భారీ మొత్తంలో హెరాయిన్‌ను తరలించేందుకు ప్రయత్నిస్తున్నారన్న సమాచారం మేరకు నిఘా వర్గాలు తనిఖీలు చేపట్టినట్లు డీజీపీ చెప్పారు. సరిహద్దు ప్రాంతం నుంచి సరుకును స్వాధీనం చేసుకున్న తర్వాత నిందితులు ఆ ప్రాంతానికి వస్తారని పోలీసులకు సమాచారం అందడంతో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామని... వారి నుంచి మొత్తం 12 కిలోల బరువున్న 16 హెరాయిన్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిందితులిద్దరూ ఇప్పటికే నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం కింద అనేక కేసులు ఎదుర్కొంటున్నారని ఫిరోజ్‌పూర్ కౌంటర్ ఇంటెలిజెన్స్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ లఖ్బీర్ సింగ్ తెలిపారు.

స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు పూర్తి చేయాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కూల్ అసిస్టెంట్ల (తెలుగు, హిందీ, ఇంగ్లీషు) పదోన్నతులు పూర్తి చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న డిమాండ్ చేశారు. అమరావతి సమగ్ర శిక్ష కార్యాలయంలో విద్యాశాఖ సంచాలకులు సురేశ్ కుమార్, సంయుక్త సంచాలకులు మువ్వా రామలింగాన్ని గురువారం కలిసిన ఎస్టీయూ నేతలు వినతి పత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులపై, ప్రత్యేకించి అనంతపురం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 200 స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)ల పదోన్నతుల పైన, అందుకు సంబంధించి కోర్టు కేసుల విషయాలను చర్చించారు. అనంతరం ఎస్టీయూ నేతలు మాట్లాడుతూ... కోర్టు కేసుల కారణంగా అనంతపురం జిల్లాలో ఆరు నెలలుగా స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషు పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయని... హైకోర్టులో ఉన్న కేసులపై వాదించడానికి ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు హాజరు కావడం లేదన్నారు. అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు ఉపాధ్యాయులను ఏర్పాటు చేసినప్పుడే ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన సాధ్యమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ స్పందిస్తూ కోర్టు కేసుల పైన తక్షణ చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం న్యాయవాది కోర్టుకు హాజరయ్యేలా ఉత్తర్వులు జారీచేశామన్నారు. కమిషనర్ ను కలిసిన వారిలో అనంతపురం ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు జి.సూర్యుడు, కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి పీక ఇమ్మానుయేల్, సత్య సాయి జిల్లా నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కేంద్రం అండతోనే అప్పులు

- రూ.11 లక్షల కోట్లకు చేరిన రుణభారం
- కృష్ణా జలాల అంశంలో రాష్ట్రానికి అన్యాయం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర బ్యూరో-గుంటూరు: మోదీ ప్రభుత్వం అండతోనే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల్లో ముంచేస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముప్పాళ్ల మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.67,500 కోట్లు అప్పు చేసిందని, మొత్తం అప్పు రూ.11 లక్షల కోట్లకు చేరిందని వివరించారు. జగన్ చేతకాని పాలనతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆరోపించారు. జగన్‌ను కేంద్రం గుండెల్లో పెట్టుకోవడంతో అప్పుల వరద ప్రవహిస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని మండిపడ్డారు. ఇటువంటి ముఖ్యమంత్రి చరిత్రలో మరొకరు లేరు... రాబోరని వ్యాఖ్యానించారు. వైసీపీ ప్రభుత్వం రాజకీయ ఉగ్రవాదానికి పాల్పడుతోందని చెప్పారు. మొన్న చంద్రబాబు...నిన్న లోకేశ్‌పై అడ్డగోలు కేసులు బనాయించి...విచారణ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. అవసరమైతే చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణీలను సైతం విచారిస్తామంటూ ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జైలులో ఉంటే బీజేపీ అగ్రనాయకత్వం కిమ్మనకుండా ఉందని, కనీసం ఖండన కూడా లేదన్నారు. ఎన్నికల్లో ఓట్లు కొల్లగొట్ట డానికి వలంటీర్ వ్యవస్థను ప్రభుత్వం వాడుకుంటుందని, ప్రభుత్వ జీతాలతో పనిచేసే వలంటీర్లు వైసీపీకి ఎలా పనిచేస్తారని ముప్పాళ్ల ప్రశ్నించారు. దీనిపై ముఖ్యమంత్రి జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సచివాలయాలు వైసీపీ ఎన్నికల కేంద్రాలుగా మారాయని

విమర్శించారు. సచివాలయ ఉద్యోగులను రాజకీయాలకు ఉపయోగిస్తే వ్యవస్థలు భ్రష్టుపడతాయని హెచ్చరించారు. జగన్ ఉచ్చులో పడవద్దని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. ఆర్థిక నేరాలలో 16 నెలలు జైలులో ఉన్న జగన్...బెయిల్‌పై బయటకు వచ్చి రాజకీయాలు చేస్తున్నారని, సుదీర్ఘకాలం బెయిల్‌పై ఉన్న రాజకీయవేత్త మరొకరు లేరన్నారు. కోర్టుకు హాజరుకాకుండా వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారన్నారు. కృష్ణా జలాలకు సంబంధించి మోదీ సర్కార్ తీసుకున్న దుర్మార్గపూరిత నిర్ణయంతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోతుందని, బీజేపీ నాయకులు మాత్రం చోద్యం చూస్తున్నారని ముప్పాళ్ల విమర్శించారు. కేంద్రం నిర్ణయంపై బీజేపీ నాయకులు స్పందించాలని, అవకాశవాదాన్ని విడనాడా లని హితవు పలికారు. కృష్ణా జలాల అంశంపై టీడీపీ చొరవతో ఈ నెల 14న విజయవాడలో జరిగే సమావేశంలో సీపీఐ పాల్గొంటుందని, 18న కడపలో సీపీఐ నేతృత్వంలో అన్ని పార్టీలు, రైతు సంఘాల అగ్ర నాయకులు, సాగునీటి రంగ నిపుణులతో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహిస్తుం దని, ఈ రెండు సమావేశాలలో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

వామపక్ష ఉద్యమాలలో ప్రజాభాగస్వామ్యం కావాలి: జంగాల

కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాలు ప్రజాసంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ విమర్శిం చారు. ఒకవైపు ధరలు ఆకాశాన్ని అంటుతుంటే మరోవైపు విద్యుత్ చార్జీల పేరుతో మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ప్రజలపై భారాలు మోపాయని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా వామపక్షాలు ప్రచారాందోళన కార్యక్రమాలు చేపట్టాయని, కరపత్రాల పంపిణీతో పాటు ప్రజా బ్యాలెట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ చార్జీలు ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు నిర్వహించే ఉద్యమాలలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ వామపక్షాల అధ్వర్యంలో నగరంలో వివిధ ప్రాంతాలలో ప్రజాబ్యాలెట్, వివిధ రూపాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

దొంగ ఓట్లతో గెలవాలని వైసీపీ కుట్ర

ఎస్ఈసీకి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రానున్న ఎన్నికల్లో అధికార వైసీపీ దొంగ ఓట్లతో గెలిచేందుకు అక్రమాలకు పాల్పడుతోందని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ)కు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం సచివాలయంలో వైసీపీ దొంగ ఓట్ల వ్యవహారాన్ని పూర్తి వివరాలతో ఎన్నికల కమిషనర్ కు వినతిపత్రం ద్వారా వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ ప్రస్తుతం వెంటిలేటర్‌పై ఉందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఘోర ఓటమి చవిచూడక తప్పదన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక ఒక్క ఎన్నిక కూడా ప్రజా ఆమోదంతో గెలిచిన సందర్భాలు లేవు. ఎప్పుడూ అక్రమాలు చేసి గెలవడం జగన్‌కు అలవాటైంది. ఇందులో భాగంగా గ్రామపంచాయతీ నుంచి ప్రతి ఎన్నికల్లోనూ అదే విధంగా గెలిచారు. రానున్న కాలంలో అయినా ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలని టీడీపీ భావిస్తోంది. రాష్ట్రంలో ఓట్ల దొంగలు పడ్డారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఓట్ల దొంగలు రాష్ట్రంలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఆ వ్యవస్థను ఉపయోగించి ప్రతిపక్షాల ఓట్లను తొలగిస్తున్నారు. వారికి అనుకూలంగా ఉన్నవారి పేర్లను జాబితాల్లో చేర్చి అక్రమంగా గెలవాలని చూస్తున్నారు. జరుగుతున్న ఈ తతంగాన్ని స్టేట్ ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లాం. గతంలో కూడా చంద్రబాబు నాయుడు ఢిల్లీ వెళ్లి కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేశారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఉపయోగించి ఎన్నికల విధానాన్ని భ్రష్టు పట్టించారు. వీటన్నింటిని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు వివరించాం. వైసీపీ నాయకులు వలంటీర్లను ఉపయోగించు కొని విపరీతంగా ఫారం 6, 7లను సమర్పిస్తున్నారు. అర్హత కలిగినవారిని మాత్రమే ఓటరు జాబితాల్లో చేర్చాలని కమిషన్ కు తెలిపాం. దానిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కమిషనర్ రూల్స్ ప్రకారం ఒక వ్యక్తి 5 అప్లికేషన్ ల కంటే ఎక్కువగా పెట్టడానికి అవకాశం లేదు. నేడు 57 మంది దాదాపు వెయ్యేసి అప్లికేషన్లు పెట్టారు. సుమారు 2,500 మంది పది నుంచి వంద అప్లికేషన్స్ పెట్టి దొంగ ఓట్ల కింద చేర్చాలనే ప్రయత్నం చేస్తున్నారని అచ్చెన్నాయుడన్నారు. ఎన్నికల కమిషనర్ సానుకూలంగా స్పందించారని... సీరియస్‌గా యాక్షన్ తీసుకుంటామని చెప్పారన్నారు. వైసీపీ నాయకుల మాటలు విని ఓటరు జాబితాల్లో అవకతవకలు చేస్తే వారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. బెంగళూరు, ఇడుపులపాయ, కడప, లోటస్ పాండ్, తాడేపల్లిలో కట్టిన విలాసవంతమైన ప్యాలెస్ లు చాలక... ప్రకృతి ఇచ్చిన రుషి కొండను నాశనం చేసి అక్రమంగా భవనాలు నిర్మించారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్ర ప్రజల మధ్య చిచ్చు పెట్టాలన్న జగన్ ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని అచ్చెన్న అన్నారు. ఈ నాలుగేళ్లల్లో జరిగిన అన్యాయంపై వైసీపీకి బుద్ధి చెప్పడానికి ఓటర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, వర్ల రామయ్య, ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు, తాడికొండ ఇన్ చార్జ్ తెనాలి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్థాయి మరిచి మాట్లాడుతున్న సీఎం

నాదెండ్ల మనోహర్ విమర్శ

విశాలాంధ్ర-మంగళగిరి: రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి తన స్థాయి కంటే దిగజారి మాట్లాడుతున్నారని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి మాట్లాడే మాటలు స్ఫూర్తినివ్వాలిగానీ ఈ ముఖ్యమంత్రి మాటలు సహనం కోల్పోయేలా చేస్తున్నాయన్నారు. సమస్యలను పరిష్కరిస్తూ ముందుకెళ్లడం ఎలా అన్నది చెప్పగల సామర్థ్యం ముఖ్యమంత్రికి ఉండాలి కానీ వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితంపై పదేపదే విమర్శలు చేయడం ఆమోదయోగ్యం కాదన్నారు. పాలన చేతకాక... మానసిక స్థితి సరిగాలేక విసుగుతో మాట్లాడుతున్నట్లు ఉన్నదని వ్యాఖ్యానించారు. వైసీపీ పాలనలో ఎంత మంది నష్టపోయారు. ఎంతమంది ఉపాధి లేక వలస వెళ్లారనే లెక్క లేదని మనోహర్ అన్నారు. ప్రజాధనంతో నిర్వహించే సభలో రాష్ట్ర భవిష్యత్తు, యువతకు కల్పించాల్సిన అవకాశాలు, ప్రభుత్వ కార్యక్రమాల గురించి మాట్లాడాల్సిన సీఎం జగన్, పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సరైనది కాదన్నారు. మహిళలను కించపరిచేలా, వారి ఆత్మగౌరవం దెబ్బతీసేలా ఆయన పెళ్లిళ్లను ప్రస్తావించడాన్ని ఖండిస్తున్నామని నాదెండ్ల మనోహర్ అన్నారు. మహిళలకు జగన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను దొంగ లెక్కలు, చీకటి జీవోలతో మోసం చేస్తోందని, సీఎం క్యాంపు కార్యాలయం నిర్మించి, అదే ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ అంటూ మరో కట్టుకథ చెప్పేందుకు సిద్ధమవుతోందని వ్యాఖ్యానించారు. దానిని ఉత్తరాంధ్ర అభివృద్ధిగా నమ్మించేందుకు యత్నిస్తున్నదని మనోహర్ అన్నారు. సమావేశంలో బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, గాదె వెంకటేశ్వరరావు, పోతిన వెంకట మహేశ్, చిల్లపల్లి శ్రీనివాసరావు, అమ్మిశెట్టి వాసు, నేరెళ్ల సురేశ్, అక్కల రామ్మోహన రావు, డి.వరప్రసాద్, బండి రామకృష్ణ, బేతపూడి విజయశేఖర్, ప్రకాశ్ పాల్గొన్నారు.

ఎత్తు విషయంలో తేడాలెందుకు?

ఎస్సై నియామకాలపై హైకోర్టు తీర్పు రిజర్వ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సై పోస్టుల నియామకాలపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 56 వేల మంది దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యారని, వారిలో సరిపడా ఎత్తు లేరని 5 వేల మందిని తిరస్కరించారని పిటిషనర్ల తరపు న్యాయవాది జడ శ్రవణ్ కోర్టుకు తెలిపారు. అయితే తిరస్కరణకు గురైన అభ్యర్థులందరూ 2019లో క్వాలిఫై అయినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అప్పుడు క్వాలిఫై అయినవారు, ఇప్పుడెందుకు తిరస్కరణకు గురయ్యారు? ఎత్తు విషయంలో తేడాలెందుకు వచ్చాయని ధర్మాసనం ప్రశ్నించింది. డిజిటల్ ఎలక్ట్రానిక్ మిషన్ ద్వారా ఎత్తు కొలిచారని న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రతి అభ్యర్థి విషయంలో పారదర్శకంగా చర్యలు తీసుకున్నామని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. ఈ నెల 14న జరిగే మెయిన్స్‌ను తాత్కాలికంగా వాయిదా వేయాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. రాష్ట్ర ప్రభుత్వ తప్పిదాల వల్ల నోటిఫికేషన్ రద్దు చేయాలని కోరారు. రెండుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పు రిజర్వ్ చేసింది.

ఆరేళ్ల కనిష్ఠానికి నిరుద్యోగం

దేశానికి పెరుగుతున్న యువశక్తి: కౌషల్ దీక్షత్ సమారోలో మోదీ

న్యూఢిల్లీ: ఇది భారత్ శకం, మరికొన్నేళ్లలో ప్రపంచంలో టాప్ 3 ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలవబోతోందని ప్రధాని మోదీ అన్నారు. భారత్‌కు యువశక్తి పుష్కలంగా ఉందన్నారు. నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా అన్ని రంగాల్లో రాణించగలమని చెప్పారు. దేశంలో నిరుద్యోగం ఆరేళ్ల కనిష్ఠంగా నమోదైనట్లు మోదీ ప్రకటించారు. ఆర్థికవృద్ధి ద్వారా యువతకు కొత్త అవకాశాల సృష్టి సాధ్యమన్నారు. గురువారం నైపుణ్యాభివృద్ధి, ఎంట్రప్రెన్యూర్ శాఖ అధ్వర్యంలో 'కౌషల్ దీక్షత్ సమారో'నుద్దేశించి మోదీ వీడియో సందేశ మిచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో నిరుద్యోగం గణనీయంగా తగ్గినట్లు చెప్పారు. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే వార్షిక నివేదిక 2022-23ను జాతీయ నమూనా సర్వే కార్యాలయం ఇటీవల విడుదల చేసింది. దీని ప్రకారం 2022 జూన్ నుంచి 2023 జూన్ వరకు 15ఏళ్ల, ఆపై వయస్సుగల నిరుద్యోగిత రేటు 3.2శాతం కాగా ఇది ఆరేళ్ల కనిష్ఠమని వెల్లడైంది. మోదీ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల తర్వాత జాతీయ విద్యా విధానాన్ని తెచ్చామని, నైపుణ్యాలు, విద్య ద్వారా కొత్త అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా దేశ యువతను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఐఐటీలు, ఐఐఎంలు, ఐటీఐలతో పాటు వైద్య కళాశాలలను పెంచుతూ కోట్లాది మంది యువతకు మంచి భవిష్యత్‌కు హామీనిస్తున్నట్లు చెప్పారు. చాలా దేశాల్లో వృద్ధులు పెరుగుతుంటే భారత్‌లో యువత పెరుగుతుండటం కలిసివచ్చే అంశమన్నారు. భారత శ్రామికశక్తిలో మహిళా భాగస్వామ్యం పెరుగుతోందని అన్నారు. గత ప్రభుత్వాలు నైపుణ్యాభివృద్ధిని నిర్లక్ష్యం చేయగా తమ ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చిందని, ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసి వేరుగా బడ్జెట్‌నూ కేటాయించిందని అన్నారు. స్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్ ప్రాధాన్యతలను చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పరిశ్రమలు, పరిశోధనలు, నైపుణ్యాభివృద్ధి ఇన్‌స్టిట్యూట్‌లు ఉండా లన్నారు. తొమ్మిదేళ్లలో ఐదువేల కొత్త ఐటీఐలు, నాలుగు లక్షలకుపైగా సీట్లు అందుబాటు లోకి వచ్చాయన్నారు. మోడల్ ఐటీఐలు రూపుదిద్దుకుంటున్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి కౌషల్ వికాస్ యోజన కింద 1.5కోట్ల మంది యువతకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి తాజా గణాంకాల ప్రకారం వేగంగా అభివృద్ధి చెందే దేశంగా భారత్ ఉందని, మరో మూడు లేక నాలుగేళ్లలో ప్రపంచంలోని టాప్ 3 ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలుస్తుందని మోదీ ఆకాంక్షించారు.

లైంగిక వేధింపులకు గురైన పిల్లలకు

మానసిక నిపుణుల శిక్షణ అవసరం: సుప్రీం

న్యూఢిల్లీ: లైంగిక వేధింపుల నుంచి బయటపడ్డ పిల్లల పునరావాసం విషయంలో కేవలం ఆర్థిక పరిహారం చెల్లిస్తే సరిపోదని, శిక్షణ పొందిన చైల్డ్ కౌన్సెలర్ లేదా మానసిక నిపుణుల ద్వారా వారికి కౌన్సెలింగ్ అందించడం ద్వారా వారు ఆ బాధనుంచి బయటపడేలా భరోసా నివ్వాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలాంటి పిల్లలు తమ విద్యను కొనసాగించేలా చూడాల్సిన అవసరం ఉందని న్యాయమూర్తులు అభయ్ ఎస్ ఓకా, పంకజ్ మిథాల్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. 'లైంగిక వేధింపులకు గురైన పిల్లలకు రాష్ట్రప్రభుత్వం లేదా న్యాయ సేవల అధికారులు... శిక్షణ పొందిన చైల్డ్ కౌన్సెలర్ లేదా చైల్డ్ సైకాలజిస్ట్ ద్వారా వారికి కౌన్సెలింగ్ ఇప్పించాలి. ఇది బాధిత పిల్లలు గాయం నుండి బయటపడటానికి సహాయపడుతుంది. ఇది భవిష్యత్తులో వారు మెరుగైన జీవితాన్ని గడపడానికి వీలు కల్పిస్తుంది' అని ధర్మాసనం వివరించింది. బాధితురాలి చుట్టూ ఉన్న సామాజిక వాతావరణం బాధితుల పునరావాసానికి అనుకూలంగా ఉండకపోవచ్చని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. "కేవలం ద్రవ్య పరిహారం మాత్రమే సరిపోదు. పరిహారం చెల్లింపు అనేది నిజమైన పునరావాసం కాదు. బాధితులైన బాలికలకు పునరావాసం కేంద్ర ప్రభుత్వ 'బేటీ బచావో బేటీ పడావో' ప్రచారంలో భాగంగా ఉండాలి. సంక్షేమ రాజ్యంగా అలా చేయడం ప్రభుత్వ విధి. ఈ తీర్పు కాపీలను రాష్ట్రంలోని సంబంధిత శాఖల కార్యదర్శులకు పంపాలని ఆదేశిస్తున్నాం" అని ధర్మాసనం పేర్కొంది. బాలికపై అత్యాచారం కేసులో దోషికి విధించిన శిక్షను జీవిత ఖైదు నుండి 12 సంవత్సరాలకు తగ్గిస్తూ రాజస్థాన్ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ఈ విధంగా తీర్పునిచ్చింది. దోషి14 ఏళ్ల జైలు శిక్ష తప్పకుండా అనుభవించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇప్పటికీ చెల్లించనట్లయితే... సంబంధిత బాధితుల పరిహార పథకం కింద బాధితురాలికి ఆమె అర్హత ప్రకారం అందవల్సిన సహాయాన్ని తక్షణమే చెల్లించేలా చూడాలని రాజస్థాన్ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శిని సుప్రీంకోర్టు ఆదేశించింది. 'హైకోర్టు తీర్పు ప్రకారం ప్రతివాది శిక్ష అనుభవించి ఇప్పటికే విడుదలై ఉంటే, ఈ తీర్పు ప్రకారం మిగిలిన శిక్షను అనుభవించినందుకు అతన్ని వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలి' అని ధర్మాసనం స్పష్టం చేసింది. కేసు టైటిల్‌లో దోషి కులం ప్రస్తావించబడిందని పేర్కొన్న అత్యున్నత న్యాయస్థానం... దీనిపై అభ్యంతరం తెలిపింది. వ్యాజ్యం చేసిన వ్యక్తి కులం లేదా మతాన్ని ఎప్పుడూ ప్రస్తావించరాదని పేర్కొంది. నిందితుడి కులమతాలతో సంబంధం లేకుండా కోర్టు తన కేసును విచారిస్తుందని తెలిపింది. హైకోర్టు, ట్రయల్ కోర్టు తీర్పులలో నిందితుడి కులాన్ని ఎందుకు ప్రస్తావించారో మేము అర్థం చేసుకోలేకపోతున్నామని ధర్మాసనం పేర్కొంది.

వ్యవసాయ రంగానికి పునాది కూలీలే

కోటేశ్వరరావు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం: దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకం అయిన వ్యవసాయ రంగానికి పునాదిరాళ్లు వ్యవసాయ కార్మికులేనని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం కొత్తూరు తాడేపల్లిలో గురువారం జరిగిన మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత మన దేశానికి వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయమే జాతీయ సంపదలో అగ్రభాగాన నిలుస్తుందని అలాంటి ప్రాధాన్యత కలిగిన వ్యవసాయ రంగంలో పునాదిరాళ్లుగా శ్రమ భారాన్ని మోస్తున్నది వ్యవసాయ కార్మికులేనని దేశ సంపద సృష్టిలో ఈ కష్టజీవుల పాత్ర మరువలేనిదని కోటేశ్వరరావు అన్నారు. కానీ ఈ గ్రామీణ శ్రమజీవులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. దారిద్ర్యం నుంచి పేదలకు విముక్తి కలిగించడానికి పాలకులు ఏ మాత్రం చిత్తశుద్ధి చూపించడం లేదన్నారు ఈ పేదలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ఒక్క శాతం కూడా పాలకులు కల్పించకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘాలు వీరికి అండగా, దన్నుగా నిలబడి నిర్వహించిన నిర్వహిస్తున్న పోరా టాల ఫలితంగా భూ సాధనలో అనేక హక్కులను సాధించుకొని సమస్యలు పరిష్కరించుకోగలుగుతున్నామని వివరించారు. వ్యవసాయ కార్మిక సంఘాన్ని మరింత బలోపేతం చేసుకుని పోరాటాలకు మరింత పదనుపెట్టి ముందుకు సాగాలని సూచించారు. ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షులు ఉప్పె నరసింహారావు సంఘం నిర్వహించిన ఉద్యమాలను, భవిష్యత్ కర్తవ్యాలను వివరించారు. మండల వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు ఇస్లావత్ బుడ్డియ్య, సాంబశివరావు, బాలకోటి, లింగయ్య, వెంకటేశ్వర రావు, రామప్ప, తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ వైపు బీజేపీ, జేడీఎస్ నేతల చూపు: శివకుమార్

బెంగళూరు: బీజేపీ, జేడీఎస్ నుంచి 40 మంది నాయకులు కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నారని కర్నాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ గురువారం చెప్పారు. బీజేపీ, జేడీఎస్ మధ్య కుదిరిన పొత్తును ఆ నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే రామప్ప లామాని కాంగ్రెస్ పార్టీలో చేరిన అనంతరం శివకుమార్ విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి షరతులు లేకుండానే తాను కాంగ్రెస్‌లో చేరినట్లు లామాని చెప్పారు. బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని మాజీ ప్రధాని దేవెగౌడ నేతృత్వంలోని జేడీఎస్ నిర్ణయించుకుంది. అందులో భాగంగా ఇటీవల జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో ఢిల్లీలో చర్చలు జరిపారు. '40కి పైగా దరఖాస్తులు నా ముందుకు వచ్చాయి. ఆ పేర్లు వెల్లడించాలని నేను ఎప్పుడూ కోరుకోలేదు. కానీ ఇప్పుడు చెప్పాల్సిన పరిస్థితి వచ్చింది' అని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కూడా అయిన శివకుమార్ చెప్పారు. అయితే ఆ నాయకుల పేర్లు మాత్రం వెల్లడించలేదు. స్థానిక నాయకులతో సంప్రదించిన తర్వాత ఒక్కొక్కరినీ పార్టీలో చేర్చుకుంటామన్నారు. బీదర్, చామరాజనగర్ జిల్లాలకు చెందిన బీజేపీ, జేడీఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరడానికి ఆసక్తి ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. బీజేపీ, జేడీఎస్ పొత్తును వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ నాయకులను చేర్చుకోవడం ద్వారా తమ పార్టీకి, దేశానికి ప్రయోజనం ఉంటుందని తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ టికెట్‌పై పోటీ చేసిన 100 మంది నాయకులు సైతం కాంగ్రెస్‌లో చేరాలని కోరుకుంటున్నారని శివకుమార్ చెప్పారు.

16లోగా 'బిల్కిస్' దోషుల రెమిషన్ రికార్డులివ్వండి

కేంద్రం, గుజరాత్ ప్రభుత్వానికి సుప్రీం ఆదేశాలు - తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ: బిల్కిస్ బానో కేసులో 11మంది దోషుల రెమిషన్ రికార్డులను సమర్పించాలని గురువారం కేంద్రానికి, గుజరాత్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. ఇందుకోసం ఈనెల 16వ తేదీ వరకు గడువు ఇచ్చింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించింది. దోషుల రెమిషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై బిల్కిస్ బానోతో పాటు కేంద్రం, గుజరాత్ ప్రభుత్వం, పిల్ పిటిషనర్ల సీపీఎం నేత సుభాషిణి అలీ, స్వతంత్ర జర్నలిస్టు రేవతి లౌల్, లక్నో వర్సిటీ మాజీ వీసీ రూప్ రేఖా వర్మ తరపు వాదనలు విన్న తర్వాత తీర్పును రిజర్వులో ఉంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. దోషులకు శిక్ష పూర్తికాకుండా ముందస్తుగా విడుదల చేయడాన్ని వ్యాజ్యదారులు సవాల్ చేశారు. ఇదే వ్యవహారంలో టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా కూడా పిల్ వేశారు. 2002లో గోద్రా అల్లర్ల సమయంలో భయానక పరిస్థితులను అనుభవించిన బిల్కిస్‌కు అప్పుడు 21 సంవత్సరాలు. సామూహిక అత్యాచారానికి గురైన ఆమె ఐదు నెలల గర్భిణీ కాగా అల్లర్లలో మూడేళ్ల కుమార్తె సహా ఏడుగురు కుటుంబ సభ్యులను కోల్పోయారు.

ఇజ్రాయిల్ నుంచి క్షేమంగా తిరిగొచ్చిన కేరళ యాత్రికులు

కొచ్చి: ఇజ్రాయిల్ నుంచి కేరళ యాత్రికుల బృందం సురక్షితంగా తిరిగి వచ్చింది. అక్టోబరు 7న హమాస్ మిలిటెంట్లు గాజా సరిహద్దులోని ఇజ్రాయిల్ పట్టణాలపై దాడులు మొదలు పెట్టినప్పుడు యాత్రికుల బృందం అక్కడే ఉంది. భారత రాయబార కార్యాలయ అధికారులు తగిన సమయంలో జోక్యం చేసుకోవడంతో సురక్షితంగా తిరిగి రాగలిగామని వారు చెబుతున్నారు. 'మా తిరుగు ప్రయాణం ఇంకో రోజు వాయిదా వేస్తే... మేము యుద్ధంలో చిక్కుకుపోయేవాళ్లం... ఎలాగోలా మేము ఇప్పుడు స్వస్థలానికి వచ్చాము' అని ఇజ్రాయిల్ నుండి తిరిగి వచ్చిన మౌలవి అనే కేరళ యాత్రికుడు చెప్పారు. అలువాకు చెందిన మౌలవి, అతని భార్య కేరళ నుంచి ఇజ్రాయిల్ యాత్రకు వెళ్లిన 45 మంది సభ్యుల బృందంలో ఉన్నారు. వీరంతా గురువారం ఉదయం ఇక్కడి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. మొదటి పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోలేదని... అయితే క్షిపణుల శబ్దాలు, తమ చుట్టూ ఉన్న ఉద్రిక్త వాతావరణాన్ని చూసిన తర్వాత భయాందోళనకు గురయ్యామని మౌలవీ, అతని భార్య చెప్పారు. "యాత్ర ముగించుకుని అందరం అక్టోబరు 7న తిరుగుప్రయాణం అయ్యే ఉత్సాహంలో ఉన్న సమయంలో మాకు హమాస్ దాడి గురించి సమాచారం అందింది. అయినప్పటికీ మేము ప్రయాణాన్ని ప్రారంభించాం. అయితే మధ్యలో ఆపివేసి...రోజంతా అదే స్థలంలో దిక్కుతోచని స్థితిలో బిక్కు బిక్కుమంటూ గడపవలసి వచ్చింది" అని మధ్య వయస్కుడైన ఓ యాత్రికుడు గుర్తు చేసుకున్నారు.

"మేము పరాయి దేశంలో ఒంటరిగా ఉన్నామని... తమను రక్షించేందుకు ఎవరూ వెంటనే ఏమీ చేయలేరన్న ఆలోచన అందరినీ టెన్షన్‌కు గురి చేసింది. అయితే మరుసటి రోజు ఉదయాన్నే మా ప్రయాణాన్ని పునఃప్రారంభించగలిగాం... మా బృందం తబా సరిహద్దు ద్వారా ఈజిప్టులోకి ప్రవేశించింది. మేము ఇజ్రాయిల్ సరిహద్దులను దాటినప్పుడు ఎంతో ఉపశమనం పొందాము" అని మౌలవి చెప్పారు.

క్షిపణి దాడులను కిలోమీటర్ల దూరంలో జరిగినప్పటికీ... వాటి భయంకరమైన శబ్దాన్ని విన్నామని తెలిపారు. భారత రాయబార కార్యాలయ అధికారులకు మౌలవి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపాడు. వారు సత్వరం స్పందించడం వల్లే తాము తిరిగి రాగలిగామని పేర్కొన్నారు. యుద్ధం ప్రారంభమైన కొన్ని గంటల్లో వారు మా హోటల్‌కు చేరుకున్నారని తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.